ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

మే 2010

వెల : రూ. 10

ఇందు గల డందు లేడని,
సందేహము వలదు, చక్రి సర్వోపగతుం
డెం దెందు వెదకి చూచిన, నందందే కలడు,
దానవాగ్రణి! వింటే

సురభి

నేను (లావణ్యకుమార్ చక్రవర్తి) మాతృమూర్తి శ్రీ శారదాదేవి వద్ద మంత్రదీక్ష పుచ్చుకోగోరాను. ఆ విషయం గురించి అడిగినప్పుడు, "నాయనా! ఇది అన్నపూర్ణ, విశ్వనాథులు పాలించే స్థలం. ఇక్కడ మంత్రదీక్ష ఇచ్చే అధికారం లేదు. కలకత్తాలో మంత్రదీక్ష పుచ్చుకోవచ్చు" అని చెప్పారు.

మాతృదేవి నుండి మంత్రదీక్ష పుచ్చుకోవడం సాధ్యపడకపోవడంతో మనస్సు ఆవేదన చెందింది. అలాగే విశ్వనాథుని దర్శనానికి వెళ్ళాను. దారిలో 'మ' (మాస్టర్ మహాశయ్) కనిపించి, నా భుజాల మీద చేతులు వేసి, "ఏమిటి, మాతృదేవిని దర్శించావా?" అని అడిగారు. జరిగిందంతా పూసగ్రుచ్చినట్లు ఆయనకు వివరించి చెప్పాను. నా ఆవేదనను కూడా తెలిపాను. అప్పుడాయన "సూర్యచంద్రులు పాతాళంలోకి క్రుంగిపోవచ్చు. భూమి అపసవ్య దిశలో తిరగవచ్చు. కానీ మాతృదేవి మాట వృథా కాదు" అని అన్నారు. శ్రీ 'మ' మాటలు విన్న తరువాత నా మనస్సులో నూతనోత్సాహం పెల్లుబికింది.

మంత్రదీక్ష పుచ్చుకొనే రోజు రానే వచ్చింది. మాతృదేవి పూజ గదిలో ఆసీనులై ఉన్నారు. ప్రక్కనున్న ఆసనం మీద నన్ను కూర్చోమన్నారు. గురుదేవుల నుంచి స్వీకరించిన జ్యోతిర్మయమైన మంత్రాన్ని నాకు ప్రసాదించారు. మాతృదేవి నోట ఆ మంత్రం వెలువడగానే నాలో ఒక రకమైన పారవశ్యం ఉప్పొంగింది. పూజామందిరంలో ఉన్న గురుదేవుల మూర్తినీ, గోడపై వ్రేలాడుతున్న తమ ఛాయాచిత్రాన్నీ చూపి, "వీటిని ధ్యానించినా చాలు నాయనా" అని ఆమె చెప్పారు. ఆమెకు ప్రణమిల్లి బయటకు వచ్చాను.

బయటకు వచ్చినప్పుడు, 'అయ్యో! మాతృదేవి నా తల మీద చేతులు ఉంచి దీవించలేదే!' అని అనుకొన్నాను. ఇంతలో వెనుక నుండి ఒక బ్రహ్మచారి వచ్చి, "మాతృదేవి మిమ్మల్ని పిలుస్తున్నారు" అని చెప్పాడు. లోపలకు వెళ్ళగానే మాతృదేవి తమ చేతిని నా తల మీద ఉంచి ఆశీర్వదిస్తూ, "ఇప్పుడు తృప్తిగా ఉందా!" అని అన్నారు. ఉద్వేగంతో మాతృదేవి పాద పద్మాలకు ప్రణమిల్లాను. ❖

(లావణ్యకుమార్ చక్రవర్తి స్మృతుల నుంచి)

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 67 సంచిక: 5 మే 2010

యది దాస్యసి మే కామాన్ వరాంస్త్వం వరదర్షభ ।
కామానాం హృద్యసంరోహం భవతస్తు వృణే వరమ్ ॥

వరదాతలలో శ్రేష్ఠుడవైన ఓ స్వామీ! నీవు నాకు ఇష్టమైన వరములను కోరమని నన్ను అడిగినచో నా హృదయంలో కామవాసనలు కలుగకుండునట్లుగ వరములను వేడుకొందును.

– శ్రీమద్భాగవతం, సప్తమ స్కంధం

లోపలి పేజీల్లో...

4
సంపాదకీయం
సత్సంగం సకలార్థ సాధకం!

13
ధీరవాణి
పరోపకారం పరమోత్కృష్ట ధర్మం!

7
కాముడున్నచోట రాముడుండడు!

14
పరిప్రశ్న

8
బుద్ధ ధర్మం



15
ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన...

9
పరమేశ్వరుని పరిరక్షణలో...
అమరనాథ్ యాత్రా స్మృతులు

16
బొమ్మల కథ
మహాత్ముల త్యాగఫలం – కావేరీ నది ఆవిర్భావం

10
దేవీ వైభవం

18
ఆది శంకరుల అమృతఫలాలు



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు...........	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాత పేరు	చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: శ్రీ మల్లెల దక్షిణామూర్తి & శ్రీమతి లక్ష్మి, ఆర్.కె. పురం, కంటోన్మెంట్, సికింద్రాబాద్	10,000
మహారాజ పోషకులు	: శ్రీ ఎమ్. కృష్ణాంజనేయులు, గిరిజామణి, శివ - డోన్, కర్నూలు జిల్లా	10,000
రాజ పోషకులు	: డాక్టర్ బి. వెంకట్ సునీల్, ధర్మవరం, అనంతపురం జిల్లా	5,000
పోషకులు	: కుమారి కటారి సాయి ప్రీతి, పుత్తూరు, చిత్తూరు జిల్లా - 517 583	1,116
పోషకులు	: శ్రీ కందనూలు గురప్ప, టెలికామ్ నగర్, కర్నూలు (కీ॥శే॥ పెద్దయ్యగారి హరిదాసుగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు	: శ్రీ ఆకురాతి జగన్మోహనరావు & శ్రీమతి జానకీదేవి, నాగ్‌పూర్ (కీ॥శే॥ ఎ. సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు	: శ్రీ ఇ. నారాయణ, కూచనపల్లి, మెదక్ జిల్లా - 502 130	1,116
పోషకులు	: శ్రీ కె. వేద కిరణ్ రెడ్డి, సోమాజీగూడ, హైదరాబాద్ - 500 082	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి./ చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో

స్వామి జ్ఞానదానంద

అధ్యక్షులు

ముఖచిత్రం : ప్రహ్లాద సమేత శ్రీ నృసింహస్వామి. చిత్రకారుడు - మణియన్ సెల్వమ్, చెన్నై.

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు		ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	:	రూ. 10	-
ఒక సంవత్సర చందా	:	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా : Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

19 అభయ ప్రదం నృసింహ వ్రతం

28 సంతోషంగా జీవించడం ఎలా?

20 ఓ మహాత్యాగి ఆత్మకథ
(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

31 మహనీయుల జీవితాల్లో మధురఘట్టాలు
అందరి సుఖంలోనే ఆత్మ సుఖం



22 ప్రాచీన గాథలు : జీవన వికాసం
మంత్రం-పరమార్థం

33 నా జీవితంలో స్వామి వివేకానంద
ధైర్యాన్నిచ్చిన ధీర సన్న్యాసి

24 యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

34 వినడం ఒక కళ!

25 ఉన్నత స్థితికి ఉత్తమ మార్గం

35 ఆచార వ్యవహారాలు-అంతరార్థాలు
తులసికి పురాణాలిచ్చిన ప్రాధాన్యం

26 కుటుంబమే కరదీపిక

38 విజ్ఞానం - వికాసం
యక్ష ప్రశ్నలు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకు కుడి భాగంలో మీ చందా గడువు ముగిసే నెల వ్రాసి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకోండి. 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

- సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh
Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

సత్సంగం సకలార్థ సాధకం!

భగవత్సాక్షాత్కారానికి మానవ దేహం పరమోత్తమ సాధనం. దేవతలు సైతం ఈ మానవ దేహం పొందాలని తపిస్తుంటారు. అలాంటి అరుదైన మానవ జన్మను భగవత్ సాక్షాత్కారానికి కాకుండా భోగలాలసతలో మునగడానికీ, భవబంధాలలో బందీలమవడానికీ వినియోగించడం అవివేకం. కాబట్టి ఇంద్రియాలనూ, మనస్సునూ, బుద్ధినీ విషయసుఖాల వైపు పరుగులు తీయనివ్వకుండా నియంత్రించి, ఆత్మ సాక్షాత్కారం కోసం ప్రయత్నించడం వల్ల మానవజన్మ సార్థకమవుతుంది.

అమూల్యమైన మానవ దేహాన్ని నిస్సారమైన క్షణిక సుఖాల కోసం దుర్వినియోగం చేసుకొనేవాడు మూఢుడు అని మన శాస్త్రాలు ఇలా వచిస్తున్నాయి:

సౌవర్ణై ర్లాంగలాగ్రై ర్విలిఖతి వసుధామర్క తూలస్యహేతోః ।
ప్రాప్యేమాం కర్మభూమిం న భజతి పురుషో యస్తపో మన్ద భాగ్యః ॥

'కర్మభూమి అయిన ఈ భారతదేశంలో మానవునిగా జన్మించి పరమాత్మను ధ్యానించకుండా, భోగవిలాసాలలో సమయాన్ని వృథా చేసిన వాడు బంగారపు నాగలితో నేలను దున్ని, జిల్లేడు మొక్కలు నాటడానికి ప్రయత్నించిన మందమతి లాంటివాడు.'

బంగారపు నాగలి లాంటి ఈ దేహంతో సాధన చేసి, వివేక వైరాగ్య బీజాలను నాటి, ఆత్మసాక్షాత్కారం పొందడానికి ప్రయత్నించకుండా విషయ సుఖాల్లోనే జీవితాన్ని గడిపితే మనం కూడా మూఢులమే!

అందుకే మరణం సంప్రాప్తించే సమయంలో కూడా భగవంతుణ్ణి స్మరించకుండా 'డుకృఞ్ కరణే' అని వ్యాకరణం వల్లె వేస్తున్న ఒక వృద్ధుణ్ణి చూసి శ్రీశంకర భగవత్పాదులు, *'భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే'* అని అతనికి తరుణోపాయాన్ని సూచించారు. అదే 'భజగోవింద స్తోత్రం'గా ప్రసిద్ధం.

భజగోవింద స్తోత్రం పఠించినప్పుడు మనలోని మూఢత్వం పోయి భగవంతుణ్ణి దర్శించాలనే తపన కలుగుతుంది. కానీ ఆ తపన ఒక నిప్పురవ్వ లాంటిది. ఆ తపన సన్నగిల్లి పోకుండా ఉండాలంటే ఏం చేయాలి? 'నిప్పురవ్వ ఆరిపోకుండా ఉండడానికి అప్పుడప్పుడు సత్సంగమనే కుంపటిలో మనస్సును ప్రజ్వలింపజేయాలి' అని శ్రీరామకృష్ణులు బోధించారు.

ఈ భవబంధాల నుండి విముక్తులం కావడానికి సత్సంగం ఓ అమృత ఫలం లాంటిది.

సంసార విషవృక్షస్య ద్వే ఫలే హ్యమృతోపమే ।
సుభాషిత రసాస్వాదః సంగతిః సుజనైః సహ ॥

'ఈ సంసార విష వృక్షంలో మానవుల్ని అమరుల్ని చేసే అమృత ఫలాలు రెండున్నాయి. అవి శాస్త్ర వచనాల రసాస్వాదనం, సజ్జనుల సాంగత్యం.'

శ్రీశంకరాచార్యులు సత్సంగ ప్రాముఖ్యాన్ని ఇలా స్తుతించారు:

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥

సత్సంగమనే నావ సహాయంతో భవసాగరాన్ని దాటి ముక్తిధామాన్ని చేరవచ్చు. అందువల్ల సత్సంగం ముక్తికి సోపానం లాంటిది. 'స్వర్గసుఖాలన్నీ ఒక్క నిమిషం సత్సంగం వల్ల కలిగే ఆనందంతో సరితూగవు' అని సత్సంగ మాహాత్మ్యాన్ని వివరించారు సంత్ తులసీదాసు.

సత్సంగత్వే నిస్సంగత్వం: ముక్తిని పొందాలంటే ఏం చేయాలని హిమవంతుడు, తన కుమార్తె అయిన ఉమాదేవిని ప్రశ్నించాడు. అందుకు ఆమె 'తండ్రీ! ఆత్మ సాక్షాత్కారానికి సజ్జన సాంగత్యం చేయాలి' అని సమాధానమిచ్చింది. సాక్షాత్తూ ఆ జగజ్జననే సత్సంగ మాహాత్మ్యాన్ని శ్లాఘించిందంటే ఇక సత్సంగ మహిమ ఎంతటిదో వేరే వివరించనవసరం లేదు.

'సజ్జన సాంగత్యం బియ్యపు కడుగు లాంటిది. కల్లు తాగడం చేత కలిగే మత్తును పోగొట్టే శక్తి బియ్యపు కడుగుకు ఉంది. విషయ వాంఛల మత్తులో ఉన్నవారికి సత్సంగం బియ్యపు కడుగులా పనిచేస్తుంది' అని శ్రీరామకృష్ణ పరమహంస సత్సంగ ప్రయోజనాన్ని తెలిపారు.

ప్రాపంచిక విషయాల మత్తు తొలగితే మనస్సు భగవంతుని పాదపద్మాలపై ఏకాగ్రమవుతుంది. అప్పుడు ఆ మనస్సు నీటిలో ఉన్నా నీటిని అంటకుండా ఉండే పద్మపత్రం లాంటిది. అలాంటి మనస్సుతో ఈ లోకంలో ఏ కార్యాన్ని అయినా నిస్సంగ భావంతో

నిర్వర్తించవచ్చు. సత్పురుషుల సాంగత్యం వల్ల భగవంతునిపై అనురాగం, ప్రాపంచిక విషయాలపై విరాగం వృద్ధి చెందుతాయి.

నిస్సంగత్వే నిర్మోహత్వమ్: మన సుఖదుఃఖాలకు కారణం అశాశ్వతమైన విషయాలపై మమకారాన్ని పెంచుకోవడమే! నిజానికి అనిత్యమైన ఈ లోకంలో దేని నుండీ మనం శాశ్వతానందం పొందలేం. అందుకే శ్రీకృష్ణ భగవానుడు 'ఈ లోకం అనిత్యం, అసుఖం, దుఃఖాలయం' అని ఈ లోక స్వభావమైన అశాశ్వతత్వాన్ని తెలియజేశాడు. అనిత్యమైన ఈ లోకం నుండి శాశ్వతానందం లభించడం అసంభవమని గ్రహించి, నిస్సంగంతో జీవించిన నాడు దేనిపైనా మోహం కలగదు. అలాంటి నిర్మోహ స్థితి మనకు నిజమైన ఆనందాన్ని ఇస్తుంది.

నిర్మోహత్వే నిశ్చలతత్త్వం: ఈ లోకంలో దేనిపైన అయినా మమకారం పెంచుకున్నప్పుడు దానిని కోల్పోతే మనకు దుఃఖం కలుగుతుంది. అలా కోల్పోయిన దానిపై మన సుఖసంతోషాలు ఆధారపడి ఉన్నాయనే మోహం కారణంగానే మనస్సు వికారం చెంది, నిశ్చలతను కోల్పోతుంది. దానివల్ల అశాంతికి గురవుతాం.

సిరిసంపదల పట్ల, భార్యాసుతుల పట్ల రాగం పెంచుకోవడం వలన అది మోహానికి దారి తీస్తుంది. అందుకే మన శాస్త్రాలు 'ధనేషణ, దారేషణ, పుత్రేషణ' అనే ఈ మూడింటినీ 'ఈషణ త్రయం'గా పేర్కొన్నాయి. ఈషణ త్రయంతో బంధితుడైన మనిషికి ముక్తి లభించడం దుర్లభమంటూ యోగి వేమన ఇలా వచించారు:

ఈషణ త్రయంబు నెడపంగ నేరక
మోహనరాశిలోన మునిగియుండు
జనుల కెట్లు మోక్ష సౌఖ్యంబు గలుగురా
విశ్వదాభిరామ వినురవేమ ॥



కాబట్టి రాగమోహాల నుంచి బయట పడినప్పుడే మానసిక ఉద్వేగాలకు లోను కాకుండా నిశ్చలంగా ఉండడం సాధ్యమవుతుంది.

నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః : సుఖదుఃఖాల వల్ల మనస్సు వికారం చెందకుండా ఉండే ద్వంద్వాతీత స్థితి నిరతిశయమైన ఆనందాన్ని ఇస్తుంది. అదే జీవన్ముక్త స్థితి.

ద్వితీయాద్వై భయం భవతి – ఈ లోకంలో మన రాగ మోహ, భయ శోకాలకు కారణం రెండో వస్తువు ఉందని అనుకోవడమే! తత్ర కో మోహః కః శోక ఏకత్వ మనుపశ్యతః – 'ఎవరైతే సర్వత్రా ఒకే ఆత్మ చైతన్యాన్ని దర్శించగలుగుతారో అలాంటి వారిలో శోకమోహాలకు తావు లేదు' అంటోంది ఈశావాస్యోపనిషత్తు.

ఎవడు జీవన్ముక్తుడు అంటే, సుఖదుఃఖాలను సాక్షీభావంతో వీక్షించినవాడు జీవన్ముక్తుడని శ్రీరామకృష్ణులు ఒక కథ చెప్పారు:

ఒక ఊరిలో ఓ రైతు ఉండేవాడు. అతడు ఆధ్యాత్మిక చింతనాపరుడు. అతడికి హరు అనే కొడుకు ఉండేవాడు. ఒకరోజు రైతు పొలంలో పనిచేస్తుండగా పొరుగింటివాడు వచ్చి హరుకి కలరా వ్యాధి సోకిందని చెప్పాడు. రైతు వెంటనే ఇంటికి వెళ్ళి, తన కుమారుడికి చేయాల్సిన చికిత్సలన్నీ చేయించాడు. కానీ ఫలితం లేకపోయింది. మరణించిన కుమారుణ్ణి చూసిన రైతు భార్య దుఃఖానికి అంతు లేదు. రైతు మాత్రం ప్రశాంతంగా కూర్చున్నాడు.

అది గమనించిన రైతు భార్య 'నీది ఎంత రాతిగుండె! కన్నబిడ్డ చనిపోయాడన్న బాధ ఇసుమంతైనా నీలో లేదు. కనీసం ఒక నీటిబొట్టైనా నీ కంటి నుంచి రాలేదే!' అని అతణ్ణి ఆక్షేపించింది. దానికి ఆ రైతు, తన భార్యతో 'నాకు నిన్న రాత్రి ఒక కల వచ్చింది. ఆ కలలో నేనొక రాజును అయినట్లూ, నాకు ఏడుగురు కుమారులు ఉన్నట్లూ కలగన్నాను. తరువాత మెలకువ వచ్చి, కల చెదిరిపోయింది. ఇప్పుడు నాకు కలలో కనిపించిన ఆ ఏడుగురు కుమారుల కోసం విలపించాలా? లేక చనిపోయిన ఈ కుమారుడి కోసం విలపించాలా?' అన్నాడు. రైతు సుఖదుఃఖాలను సాక్షీ భావంతో వీక్షించగలిగాడు. అందువల్ల అతని మనోనిశ్చలతకు భంగం వాటిల్లలేదు.

సాక్షీ భావంతో ఉండడం అంటే బాధ్యతారహితంగా వ్యవహరించమని కాదు. రైతు కుమారుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు రైతు తన బాధ్యతను విస్మరించకుండా అతణ్ణి రక్షించడానికి అన్నివిధాలా ప్రయత్నం చేశాడు. రైతులాగ మనం కూడా విధుల్ని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ సాక్షీ భావంతో ఉండగలిగితే సుఖదుఃఖాలకు అతీతమైన జీవన్ముక్త స్థితికి చేరగలుగుతాం.

అలాంటి జీవన్ముక్త స్థితికి చేరాలంటే సత్సంగమే పునాది. శ్రీశంకరాచార్యులు బోధించినట్లు సత్సంగం వల్ల రాగమోహాలు తొలగి మనోనిశ్చలత చేకూరుతుంది. అప్పుడు సుఖదుఃఖాలకు అతీతమైన జీవన్ముక్త స్థితిని పొందగలుగుతాం. అందుకే, **'సత్సంగం సకలార్థ సాధకం!'** అని అన్నారు మహాత్ములు. ❖

అరణి మథనంతో పోల్చదగిన 'సజ్జన సాంగత్యం' జ్ఞానాన్ని రగులుకొల్పుతుంది. ఆ జ్ఞానం అజ్ఞానమనే ఇంధనాన్ని సంపూర్ణంగా దహించివేస్తుంది. - ఆదిశంకరాచార్య

బాధలనే బలంగా మలచుకొందాం!

– స్వామి యతీశ్వరానంద



నిజమైన భక్తులు సంపదలూ, భౌతిక సుఖాలూ కావాలనీ, తమ కష్టాలు తొలగిపోవాలనీ ప్రార్థించరు. వారు కోరేది బాధల్ని ఓర్చుకునేందుకు కావలసిన శక్తిని తమకు ఇమ్మని మాత్రమే! రవీంద్రనాథ్ టాగూర్ వ్రాసిన ఒక చక్కని పాటను చూడండి.

"ఓ ప్రభూ! నీ సేవలో ఎదురయ్యే అతి ఘోరమైన బాధల్ని కూడా తట్టుకునే శక్తిని నాకు ఇవ్వు. నీ చేతులతోనే బహుమతులుగా అందిస్తున్న ఈ పెనుబాధల్ని వదిలించుకోవాలని నేను కోరుకోవడం లేదు. వాటితోపాటు నీ యందు భక్తిని కూడా నాకు ప్రసాదిస్తే ఈ బాధలనే నా తల మీద చూడామణిగా ధరిస్తాను".

దుఃఖాన్నిచ్చే అనుభవాలు ఎలాగూ తప్పవు కాబట్టి వాటిని ఉన్నతమైన ఆధ్యాత్మిక జీవితానికి ఉపయోగపడేలా మలచుకోవడమే మేలు. బాధలూ, అవమానాలూ ఏదో ఒక రూపంలో అందరికీ కలుగుతూనే ఉంటాయి. వాటిని మన ఆధ్యాత్మిక జీవనానికి సోపానాలుగా ఉపయోగించుకోవచ్చు. మనం సుఖాలకూ, దుఃఖాలకూ ఆవల ఉన్న దైవత్వాన్నే కోరుదాం.

దైవకృప మన శారీరక బాధలనూ, దుఃఖాలనూ తొలగించకపోవచ్చు. అయితే దుర్భరమైన ఈ భవసాగరాన్ని విజయవంతంగా దాటడానికీ, ఆ క్రమంలో మనలోని కల్మషాలనన్నిటినీ కడిగివేయడానికీ అది తప్పక ఉపయోగ పడుతుంది. అది మనలోని పవిత్రతనూ, ఆత్మసమర్పణ బుద్ధినీ పెంచుతుంది. నిజానికి మనకు కలిగే బాధలు మారువేషంలో వచ్చే దీవెనలు! అవి మనకు శుద్ధబుద్ధినీ, నిశ్చలభక్తినీ కలిగిస్తాయి. ఈ ప్రపంచాన్ని గమనిస్తున్నకొద్దీ దైవకృప అంటే మన కష్టాలు తొలగిపోవడం మాత్రమే కానవసరం లేదని మరింత చక్కగా అర్థమవుతుంది. కాకపోతే అది భక్తుడికి అత్యద్భుతమైన మానసిక నిశ్చలతనూ; కష్టాలనూ, కడగండ్లనూ ఎదుర్కొనే బలాన్నీ అందిస్తుంది. అతణ్ణి చిద్విలాసంగా ఉండేలా చేయగలుగుతుంది. తద్వారా ఘోరమైన కష్టాలు ఎదురైనా తడబాటు కలుగని మనఃస్థితి, అంటే పరమశాంతి అతడికి అలవడుతుంది.

జీవితంలో ఎదురయ్యే కష్టాల నుంచి దూరంగా పారిపోవాలనుకునే వారు ఇంకా ఇంకా బలహీనులుగా తయారవుతారు. నిరంతరం సుఖాలను కోరుతూ, తమ బాధ్యతలను విస్మరించేవారి ఎదుగుదల సరిగ్గా ఉండదు. వారు ఆధ్యాత్మికంగా సంపూర్ణంగా ఉండే స్థాయికి ఎన్నటికీ చేరుకోలేరు. భగవంతుడు తమ మీద నిరంతరం కృపను వర్షించడానికి సిద్ధంగా ఉన్నా దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో వారికి తెలియదు.

మన మీద ఇప్పటికే వర్షించిన కృపను చక్కగా ఉపయోగించుకుందాం. తగినంత సమయం లేదనీ, ఎన్నో కష్టనష్టాలు ఎదురవుతున్నాయనీ గగ్గోలు చేసే కన్నా, మనకున్న సమయాన్నీ, మన శక్తియుక్తులనూ అత్యంత చాకచక్యంతో వినియోగించుకుందాం. ఆత్మసమర్పణ బుద్ధితో దైవసాక్షాత్కారానికి ప్రయత్నిద్దాం. మన మీద దైవకృప మరింతగా కలగడానికీ, భగవంతుడి పట్ల మనకు మరింత ప్రేమ కలగడానికీ సాధన చేద్దాం. ఈ ప్రపంచంలో దొరికే చిన్న చిన్న, పనికిరాని వస్తువుల కోసం మనం ప్రాకులాడ కూడదు. అవి దేవుణ్ణీ, మన ఆధ్యాత్మిక పరమావధినీ మర్చిపోయేలా చేస్తాయి. ❖

అనువాదం : ఎమ్. శివరామకృష్ణ

గోరుముద్ద వచ్చే సంచికలో **'చీకాకు'**

కాముడున్నచోట రాముడుండడు!

– స్వామి జ్ఞానదానంద

పగలు, రేయి ఎన్నడూ కలిసి ఉండవు. అలాగే భగవదాకాంక్ష – ప్రాపంచిక ఆకాంక్ష అనేవి రెండూ సహజీవనం చేయవు. అందుకే, భగవంతుణ్ణి పొందగోరే వారిని కామనారహితులుగా ఉండాల్సిందిగా శాస్త్రాలు ఉపదేశిస్తున్నాయి. 'కైవల్యోపనిషత్తు' ఇలా వచిస్తోంది:

"కర్మ చేత, సంతతి చేత, లేక ఐశ్వర్యం చేత అమరత్వం సిద్ధించదు; పరిత్యాగం చేత మాత్రమే అమరత్వాన్ని పొందగలం."

శ్రీరామకృష్ణులు కోర్కెలను ఎలా వదిలించుకోవాలో తమ శిష్యులకు ఇలా బోధించారు:

"ధర్మమార్గం ఎంతో సూక్ష్మమైనది. జాడ మాత్రమైన కోర్కె ఉన్నా సరే, భగవత్సాక్షాత్కారం పొందలేం. ఒక పోగు విడివడి ఉన్న దారాన్ని సూదిలోకి ఎక్కించలేం. ఇదీ అంతే!"

"కామినీ కాంచనాలను త్యజించకుండా ఆధ్యాత్మిక పురోగతి అసాధ్యం."

"నేతి పాత్రను పూర్తిగా ఖాళీ చేసినప్పటికీ పాత్ర అంచుల్లో నెయ్యి అంటుకొని ఉన్నట్లుగా కోర్కెలు దాగి ఉంటాయి. ఒక వ్యక్తి వద్ద ఖాళీ నేతి పాత్ర ఉంది. పొరుగునున్న వ్యక్తి కొంచెం నెయ్యి ఇవ్వమని అడిగాడు. నెయ్యి లేదని ఇతడన్నాడు. అప్పుడు పొరుగు వ్యక్తి, 'ఎండలో పాత్రను కాసేపు ఉంచి చూడకూడదా?' అని చెప్పాడు. కొద్ది సేపట్లోనే నెయ్యి కరిగి పాత్రలోకి వచ్చింది. ఆ విధంగా కోర్కెలు మనస్సులో ఘనీభవించిన స్థితిలో ఉంటూనే ఉంటాయి. వాటికి సూర్యరశ్మి తగిలినప్పుడు, అంటే ఇంద్రియ సుఖాలను ఇచ్చే వస్తువులతో సంసర్గం ఏర్పడినప్పుడు అవి అభివ్యక్తమవుతాయి. కాబట్టి సంయమం పాటించి జ్ఞానాగ్నిని పెంపొందించుకొంటే, సమస్తమైన కోరికలూ బూడిదలా దగ్ధమైపోతాయి."

ధ్యానం చేసేటప్పుడు, ప్రథమావస్థలో ఇంద్రియ విషయాలన్నీ మనస్సులో మెదలుతాయి. కానీ ధ్యానం ప్రగాఢమవగానే అవి సాధకుణ్ణి ఇక ఇబ్బందికి గురి చెయ్యవు. మనం ధ్యానానికి కూర్చున్నప్పుడు మన మనస్సులలో చెడు ఆలోచనలు సహజంగానే తలెత్తుతాయి. గురుదేవుల మనస్సులో కూడా అవి మెదలకపోలేదు. ఆయన ఇలా జ్ఞాపకం చేసుకున్నారు: "ధ్యానం చేస్తున్నప్పుడు ఎన్నో రకాల వస్తువులు నాకు కనిపించేవి. ధనరాశి, శాలువా, ఒక పళ్ళెం నిండా తీపి తినుబండారాలు, ముక్కున నత్తులు ధరించిన ఇద్దరు స్త్రీలు – ఇవన్నీ ప్రత్యక్షంగా చూశాను. నా మనస్సును ఇలా ప్రశ్నించాను: 'నీకు ఏం కావాలి? వీటిలో దేనినైనా అనుభవించాలనుకొంటే చెప్పు.' అందుకు నా మనస్సు, 'లేదు. నాకు ఏదీ వద్దు. భగవంతుడి పాదపద్మాలు తప్ప అన్యమైనది ఏదీ నాకు అక్కర్లేదు' అని జవాబిచ్చింది."

ఆధ్యాత్మిక జీవితానికి ప్రాపంచిక కోరిక – బద్ధ శత్రువు. ఈ శత్రువును తుదముట్టించడానికి శాస్త్రాలు ఎన్నో మార్గాలను వివరించి చెప్పాయి. వాటిలో కొన్ని – త్యాగాగ్ని, జ్ఞానాగ్ని, యుక్తాయుక్త విచక్షణ, నిష్కామకర్మ, భగవంతుని పట్ల భక్తిశ్రద్ధలు.

గురుదేవులు తమ భక్తులను ఇలా హెచ్చరించారు: "ధ్యానం చేస్తున్నప్పుడు నీ మనస్సులో ఏదైనా ప్రాపంచిక కోరిక మెదలడం గమనిస్తే, ధ్యానం నిలిపివెయ్యి. హృదయపూర్వకంగా భగవంతుణ్ణి, 'ఓ ప్రభూ! ప్రాపంచిక కోరికలు నా మనస్సులోనికి రానీయకుండా చూడు' అని ప్రార్థించు." ప్రార్థనలో నిజాయతీ ఉంటే భగవంతుడు తప్పక మన ప్రార్థనలను వింటాడు. ❖

నీ తలంపులకు నీవు ద్రోహివి కావద్దు. కపటము లేనివాడవై ఆలోచనలకు అనుగుణంగా ప్రవర్తింపుము. తప్పక జయం కలుగుతుంది. - శ్రీరామకృష్ణ పరమహంస

బుద్ధ ధర్మం

– శ్రీమతి బొప్పన అరుణాదేవి

బుద్ధధర్మం విశ్వంలోని మహనీయ ధర్మాలలో ఒకటి. దేశకాల పరిస్థితులను బట్టి బుద్ధుడు 2500 ఏళ్ళకు పూర్వం చేసిన ధర్మచక్రప్రవర్తనం నేటికీ సజీవంగా ఉన్నదంటే అది ఎంత మహిమాన్వితమైనదో గ్రహించవచ్చు. ఆచార్యుడు శంకర భగవానుడు కూడా 'భగవాన్ బుద్ధ' అని వ్యవహరించి, వారి పట్ల తనకు గల గౌరవాన్ని ప్రకటింపజేశారు. ధార్మికోప దేశాలతో అసంఖ్యాక మానవ కోటికి శ్రేయోమార్గాన్ని చూపిన మహనీయుడు బుద్ధుడు. అపార త్యాగం, అఖండమైన విశ్వప్రేమ, అద్భుత శీలసంపద రూపుదాల్చిన మహనీయమూర్తి. 'అహింసా పరమో ధర్మః' అనే సనాతన ధర్మాన్ని చాటిన మహా ప్రవక్త.



త్రిపిటకాలు: బుద్ధుని ఉపదేశ గ్రంథాలను 'త్రిపిటకాలు' అంటారు. అవి – 'సుత్త పిటకము, వినయ పిటకము, అభిదమ్మ పిటకము.'

'సుత్త పిటకం' ధర్మాన్ని ప్రతిపాదిస్తుంది. ఆచార ప్రధానమైనది 'వినయ పిటకం'. సుత్త పిటకంలోని సిద్ధాంతాలకు విశదీకరణమే 'అభిదమ్మ పిటకం'. దమ్మపదం బౌద్ధ సాహిత్యంలో సర్వోన్నత ప్రసిద్ధి పొందినది.

బుద్ధుడు సత్యాన్ని బహిర్గతం చేశాడు. సుఖం కోరేవారు ధర్మబద్ధంగా జీవించాలి అన్నాడు. ప్రపంచంలోని కష్టాలను చూసి వ్యథ చెంది, ప్రాపంచిక సుఖాలు నిస్సారమైనవనీ, నశించకుండా, శాశ్వతంగా ఉండేదాన్ని సాధించాలనీ, అదే ముక్తి నిస్తుందనీ భావించాడు. అహంకార నిర్మూలనే ముక్తి అని పేర్కొంటూ, దీనినే 'నిర్వాణం' అన్నాడు.

నిర్వాణానికి నాలుగు సత్యాలు: నిర్వాణానికి మార్గం చూపించే నాలుగు సత్యాలను వివరించాడు. 1. ప్రపంచం దుఃఖమయం. 2. దుఃఖానికి కారణం ఉన్నది. 3. దుఃఖాన్ని తొలగించుకోగలం. 4. దుఃఖ నివారణకు అష్టాంగమార్గాన్ని అనుసరించాలి. శాస్త్రాల్లో కూడా సంసారం, సంసార కారణం అంటూ మోక్షం, మోక్షోపాయం వివరించారు.

అష్టాంగ మార్గం: బుద్ధుడు బోధించిన సత్యాలను 'ఆర్య సత్యాలు' అంటారు. ఇక ఆయన బోధించిన మార్గం – 'అష్టాంగ మార్గం'. అష్టాంగ మార్గం అంటే ఎనిమిది అంగాలు. అవి – సమ్యక్ దృష్టి, సమ్యక్ సంకల్పం, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ, సమ్యక్ జీవనం, సమ్యక్ యత్నం, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి.

'సమ్యక్ దృష్టి' అంటే – ఈ ప్రపంచంలో ఏదీ స్థిరంగా, శాశ్వతంగా ఉండదు. ప్రతీదీ పరిణామం చెందుతూ ఉంటుంది అనే అవగాహన; 'సమ్యక్ సంకల్పం' అంటే పరిశుద్ధమైన ఆలోచనలతో, హింస – ప్రతిహింసలు లేకుండా ఉండడం; 'సమ్యక్ వాక్కు' అంటే మాట్లాడేటప్పుడు ఆచితూచి సంయమనం పాటించడం. ప్రియంగా, హితంగా మాట్లాడడం; 'సమ్యక్ కర్మ' అంటే పుణ్యకర్మలను ఆచరించడం; 'సమ్యక్ జీవనం' అంటే ధర్మబద్ధంగా, నిర్మలంగా, నిష్కళంకంగా జీవితం గడపడం; 'సమ్యక్ యత్నం' అంటే మనస్సునూ, శరీరాన్నీ పరిశుద్ధంగా ఉంచుకోవడం; 'సమ్యక్ స్మృతి' అంటే ఎల్లప్పుడూ జాగరూకతతో ఆలోచించడం; 'సమ్యక్ సమాధి' అంటే ఏకాగ్రదృష్టితో పరమజ్ఞానాన్ని ధ్యానించడం; ఇదే 'అష్టాంగ మార్గం'. బుద్ధదేవుడు లోకానికి అందించిన అమృతమయమైన నైతిక జీవనం.

బోధించిన ధర్మం: దుఃఖాన్ని నిర్మూలించి, మరణాన్ని జయించి, నిర్వాణాన్ని సాధించేలా బుద్ధుడు బోధించిన ధర్మాన్ని 'బుద్ధధర్మం' అంటారు. బుద్ధుడు తన ధర్మం లోకములో స్థిరంగా ఉండడం కోసం 'సంఘము'ను స్థాపించాడు. సంఘశక్తి వల్ల బుద్ధధర్మం అలౌకికమైన శక్తిని సాధించింది. బుద్ధధర్మానికి బుద్ధుడు, ధర్మం, సంఘం అనేవి 'త్రిరత్నాలు'. ఈ మూడింటినీ శరణు పొందిన వాడే బౌద్ధుడు. దీక్ష పొందిన వాడు సంఘ నియమాలను సావధానుడై, జాగ్రత్తగా పాటించాలి. తప్పు జరిగితే సంఘమే అతనికి దండన విధిస్తుంది. అవసరమైతే బహిష్కరిస్తుంది. ఇలాంటి వ్యవస్థను ఏర్పరచడం వల్ల బౌద్ధధర్మం స్థిరంగా వేళ్ళూనుకుంది.

బుద్ధుని ధర్మం విశ్వజనీనమైనది. బుద్ధుని దార్శనికత, ఆచారనీతి దేశ, కాలాలకు అతీతమైనది. సంక్షేమకరమైనది. జ్ఞానులందరూ బుద్ధుని ధర్మాన్ని అంగీకరించి, హృదయాలలో పదిలపరుచుకుంటారు. ❖ (మే 27, గురువారం బుద్ధ జయంతి)

పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -35

అమరనాథ్ యాత్రా స్మృతులు

స్వామి జపానంద పరివ్రాజక జీవితం గడుపుతున్న రోజులలో కాలినడకన ప్రయాణమయ్యారు. రావల్పిండిలో ఉండగా కొంతమంది అమరనాథ్ యాత్రికులతో పరిచయ మైంది. వారిలో హరి షా గారు ఒకరు. ఆయన భగవద్భక్తుడు. సాధుసన్యాసులంటే అపారమైన గౌరవం. అందరూ కథలూ పురాణాలూ చెప్పుకుంటూ సత్సంగం చేసుకుంటూ ప్రయాణం సాగించారు.

ఒక రోజు స్వామి ఒక్కరూ ముందుగా నడుస్తున్నారు. యాత్రామండలిలో మిగిలిన వారందరూ కొద్ది అడుగులు వెనుక ఆయనను అనుసరిస్తున్నారు. బాగా వర్షం పడుతోంది. ఒక మైలు దూరం నడిచి ఉంటారు. అకస్మాత్తుగా కొండలపై నుంచి రాళ్ళు, కంకర, మట్టి త్వరితగతిన దొర్లిపడడం మొదలైంది. ఎదురుగా వస్తున్న మనుష్యులు "పరుగుపెట్టండి! పారిపోండి!" అని అరుస్తున్నారు. కానీ పరుగుపెట్టేందుకు స్థలం ఏదీ! నాలుగు పక్కలా రాళ్ళ వర్షం కురుస్తున్నట్లు ఉంది. మార్గం మధ్యలో స్వామి స్థిరంగా నిల్చుని ఉండి పోయారు. ఈ రాళ్ళ వానతో ఇక్కడే జీవితం పరిసమాప్తమై పోతుంది. లేదంటే కాలో చెయ్యో విరిగి పోతుంది. ఆ భగవంతుడి ఇచ్ఛ ఏదైతే అదే జరుగుతుంది అనుకుంటున్నారు. అయితే ఆశ్చర్యమేమిటంటే ఒక్క చిన్న రాయి కూడా జపానందజీ శరీరం మీద పడలేదు. అంతేకాదు బురద చుక్కలు కూడా పడలేదు. కాలి జోళ్ళ మీద, పంచె అంచు మీద మాత్రం కొంచెం బురద అంటుకుంది. నాలుగు వైపులా మట్టితో గోడ కట్టినట్లుగా ఉంది. ఎంత ఎత్తు అంటే తోవలో ముందు వచ్చిన వాళ్ళకీ వెనక వస్తున్న భక్తమండలిలో ఎవరికీ కూడా స్వామి కనిపించడం లేదు. అందరూ ఆ మట్టి రాళ్ళ కింద ఆయన సమాధి అయిపోయారనుకుంటున్నారు. పై నుంచి వస్తున్న ఒక సిక్కు డ్రైవర్ ఒక పెద్దరాయి ఎక్కి ఆయనను చూశాడు. తలపాగాగా చుట్టుకున్న వస్త్రాన్ని తీసి కిందకు ఒక చివర విసిరారు. అది పట్టుకొని, మట్టి దిబ్బ ఎక్కి పైకి రమ్మని అన్నాడు. రెండో చివర అతను గట్టిగా పట్టుకొని, సన్యాసి పైకి వచ్చాక చెయ్యి అందించి, పైకి రావడానికి సహాయం చేశాడు. ఆ విధంగా జపానందజీ మట్టి కుప్ప మధ్యలో నుంచి బయటకు వచ్చారు. అందరూ మళ్ళీ ముందుకు సాగారు. హరి షా గారు స్వామిని గట్టిగా పట్టుకొని "మనందరి మీదా భగవంతుడికి అపారమైన దయ ఉంది. అతడే మిమ్మల్ని రక్షించాడు" అని భగవంతుడికి నమస్కరించాడు.

ముందుగా అనుకొన్నట్లు అందరూ యాత్రా నివాస్‌లో బస చేశారు.

త్రాగడానికి మంచి నీళ్ళు తీసుకురావడానికి 'నువ్వు వెళ్ళు' అంటే, 'నువ్వు వెళ్ళు' అనుకుంటున్నారు యువకులు. హరి షా గారు అది చూసి ఎవరితో ఏమీ మాట్లాడకుండా ఒక పెద్ద కుండ పట్టుకుని నీళ్ళు తేవడానికి బయల్దేరారు. అప్పుడు తోటి ప్రయాణికులు "షా గారూ! మీరు వెళ్ళడమేమిటి? మేము వెళతాం" అని ముందుకు వచ్చారు. కానీ షా గారిని ఆపడం ఎవరి తరమూ కాలేదు. చివరికి ఒక భక్తుడు "మీ ప్రయత్నాలన్నీ వ్యర్థమే. ఆయనను మీరు ఆపలేరు. ఇంకెప్పుడూ మీరు ఈ విధంగా ప్రవర్తించ కండి. షా గారు ఎక్కువ మాట్లాడరు కానీ, అందరినీ గమనిస్తూనే ఉంటారు. అన్ని రకాల పనులూ వారు చెయ్యగలరు. మీరందరూ గంటలో చేసే పనిని వారు ఒక్కరే నిమిషాలలో పూర్తి చేయగలరు. చూడండి! ఇప్పుడు మనందరం సిగ్గుపడాల్సిన పరిస్థితి వచ్చింది. వయస్సులో మనందరి కన్నా పెద్ద, పరువు ప్రతిష్ఠ, సంపద, ఆస్తి – అన్ని విషయాలలో వారు మనందరి కన్నా ఎక్కువే. మనందరం ఉండి కూడా వారు నీళ్ళు తీసుకురావడానికి వెళ్ళారు. మళ్ళీ ఈ విధమైన తప్పు జరగకూడదు" అన్నాడు యువకులతో!



అందుకు జపానందజీ, "అయ్యా! ఒక్కొక్క పని విడివిడిగా అందరికీ అప్పచెప్పండి. ఎవరి పనులు వాళ్ళు చేస్తే ఈ విధమైన గొడవలు జరగవు. అందరూ ఎవరి పనులు వాళ్ళు చేస్తున్నారా, లేదా అని మీరు చూస్తూ ఉండండి" అన్నారు. స్వామి చెప్పిన విధంగా ఒక్కొక్క పనీ ఒక్కొక్కరికీ చెప్పడం జరిగింది. ఆ తరువాత అందరూ ఆ విధంగానే నడుచుకున్నారు. ❖ **అనువాదం: శ్రీమతి జి.ఎస్. లక్ష్మి**

(మరికొన్ని 'అమర్నాథ్ యాత్రా స్మృతులు' వచ్చే సంచికలో)

నువ్వు సత్కర్మ చేస్తే అది నీ పూర్వ జన్మ దుష్కర్మను పరిహరిస్తుంది.
జప ధ్యానాల పారమార్థిక చింతనతో పూర్వజన్మ కర్మలు నశిస్తాయి. - శ్రీ శారదాదేవి

దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎస్. శేషు**

(...గత సంచిక తరువాయి)

దుర్గా, లక్ష్మీ, సరస్వతీ, గాయత్రీ, రాధా అనే అయిదూ అమ్మవారి పూర్ణస్వరూపాలు. తరువాత ఎనిమిది ప్రధానాంశ స్వరూపాలు, అంశ స్వరూపాలు, కళాంశ స్వరూపాలు, కళాంశాంశ స్వరూపాలు, కళాంశాంశాంశ స్వరూపాలు అని వివరణ చెబుతూ, మొత్తం ప్రకృతి యొక్క తత్త్వాన్ని 'దేవీ భాగవతం' వివరిస్తోంది. ఇంతవరకూ దుర్గా, లక్ష్మీ, సరస్వతీ స్వరూపాల గురించి కొంతమేరకు వివరంగా చెప్పడం జరిగింది. ఇప్పుడు 'గాయత్రీ వైభవం' గురించి చెప్పుకుందాం.

"మాతా చతుర్ణాం వర్ణానాం వేదాంగానాం చ ఛందసాం సంధ్యావందన మంత్రాణాం తంత్రాణాం చ విచక్షణా" – ఇదంతా నారాయణుడు నారదుడికి చెబుతున్న ప్రకృతి వైభవం. గాయత్రి సర్వజగజ్జనని, చాతుర్వర్ణాల (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు) వారికీ తల్లి అన్నారు. సమస్త వేద వేదాంగాలకూ తల్లి. వేదాలు, వేదాంగాలు అని రెండున్నాయి. శిక్షా, వ్యాకరణ, ఛంద, నిరుక్త, జ్యోతిష, కల్పం – ఇవి వేదాంగాలు. ఇవి ప్రధానమైన షడంగాలు. పురాణ, న్యాయ, మీమాంసాది శాస్త్రాలు ఉపాంగాలు. వీటన్నిటినీ కలిపి 'సాంగోపాంగ వేద విద్య' అంటారు. కేవలం వేదంలో ఒక మంత్రానికి అర్థం చెప్పాలంటే వేదం, సంస్కృతం తెలిస్తే చాలదు. సాంగోపాంగ జ్ఞానం ఉన్నవాడే వేద మంత్రానికి అర్థం చెప్పగలడు. ఇవన్నీ కలిపి అమ్మ స్వరూపం; అందుకే "వేదాంగానాం చ" అన్నారు. 'గాయత్రీం ఛందసాం మాతా' అన్నారు – ఛందస్సుల తల్లి ఆవిడ. ఛందస్సు అంటే నాదాత్మకంగా సాగే మంత్రం యొక్క గమనం. ఆ గమనాలకు తల్లి అయినటువంటిది.

వేదంలో చెప్పబడిన త్రిష్టుప్, అనుష్టుప్, బృహతి మొదలైన ఛందస్సులన్నింటికీ కూడా తల్లి గాయత్రి. "సంధ్యావందన మంత్రాణాం, తంత్రాణాం చ విచక్షణా" – గాయత్రీ దేవిని ఉపాసించవలసిన సమయం సంధ్య అన్నారు. అందుకే 'లలితా సహస్రం'లో "గాయత్రీ వ్యాహృతిః సంధ్యా ద్విజ బృంద నిషేవితా" అని చెబుతున్నారు. అయితే ఇక్కడ "మాతా చతుర్ణాం వర్ణానాం" అనీ, 'లలితా సహస్రం'లో "ద్విజ బృంద నిషేవితా" అనీ అన్నారు. ఇలా రెండు రకాలుగా ఎందుకు చెప్పడం జరిగిందీ అంటే – గాయత్రిని అనుష్ఠించి అపూర్వమైన వేద విద్యను పరిరక్షించవలసిన బాధ్యతను విప్రులు స్వీకరించారు. వేదం అనుష్ఠించడానికీ, అధ్యయనం చెయ్యడానికీ కావలసిన అర్హతను గాయత్రీ ఉపాసన ద్వారా వారు పొందుతున్నారు. సంప్రదాయాలు ఏర్పరచి లోకక్షేమాన్ని కోరే ఋషులు ఈ ఒక్క విద్యకే కొన్ని షరతులు పెట్టారు. మంత్ర విద్యకు కొన్ని పరిమితులు ఉంటాయి. మంత్రమనేది విజ్ఞానం. విజ్ఞానం మీద ఆధారపడ్డ హిందూమతానికి నియమాలున్నాయి.

ఉపనయన సంస్కారం పొందిన ప్రతీ ఒక్కరూ పూర్తి గాయత్రిని జపించ కూడదు. పూర్తి గాయత్రికి 32 అక్షరాలు; నిత్యం చేసే గాయత్రికి 24 అక్షరాలు, మూడు పాదాలు. మిగిలిన 8 అక్షరాలు జపించడానికి ప్రత్యేక దీక్ష, ప్రత్యేక నియమాలు, ప్రత్యేకమైన విధానాలు ఉన్నాయి. మామూలు ఉపనయన సంస్కారం పొందినవారు ఈ 8 అక్షరాలు జపించడానికి లేదు. అందుకే గాయత్రి లలితాదేవి స్వరూపం అని చెబుతూనే "గాయత్రీ వ్యాహృతిః సంధ్యా ద్విజ బృంద నిషేవితా" అని స్పష్టం చేశారు, ఎవరికి అర్హత ఉందో కూడా అక్కడ చెప్పారు.

గాయత్రీ దేవిని అందరూ జపించవచ్చు. అదెలా అంటే ఎవరికి ఉపదేశింప బడిన మంత్రం వారు సంధ్యాకాలాల్లో ఉపాసన చేస్తే అదే వారికి గాయత్రి. వారి ప్రాణశక్తిని ఆ మంత్రం కాపాడుతుంది. ఇదొక రహస్యం! సంధ్యోపాసన అన్నప్పుడు భౌతిక సంధ్య, ఆంతరిక (అభ్యంతర) సంధ్య అని రెండున్నాయి. ఈ అభ్యంతర (ఆంతరిక) సంధ్య అన్నది ఒక స్థితి. ఆ స్థితిని సాధన ద్వారా పొందవచ్చు. సాధన ద్వారా సంధ్యాస్థితిని పొందినవాడు నిత్యసంధ్యోపాసకుడు. భౌతికంగా మనం చూసేవి ప్రధానంగా మూడు సంధ్యలు. కాలానుగుణమైన సంధ్యోపాసన భౌతికంగా చేసేది. అది ముందు అలవాటు చేసుకోవాలి. క్రమ క్రమంగా అందరూ

చెయ్యవలసినది సమ్యక్ ధ్యానం సంధ్య. అంటే సమగ్రమైన ధ్యాన స్థితే సంధ్య అనేది. ఆ ధ్యాన స్థితిలో అనుభూతమయ్యే బ్రహ్మానుభవం గాయత్రి. ఈ స్థితిని ఎవరైనా వారి ధ్యాన ప్రక్రియ ద్వారా సాధించవచ్చు. శరీరంలో ఆంతరికమైన సంధ్యా స్థానం "భ్రూ ఘ్రాణంబుల సంధి" అన్నారు; అదే సంధ్యాస్థానం అని చెబుతున్నారు. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో ఈ భ్రూమధ్య దృష్టి గురించి వివరించారు. ఆత్మ తత్త్వావిష్కరణకు ధ్యానం అవసరం; ఆత్మ తత్త్వావిష్కరణ కేవలం విచారణమార్గం ద్వారా లభించదు. ఆ విచారణకు ధ్యానం తోడవ్వాలి.

సమ్యక్ ధ్యాన స్థితే – సంధ్య అని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరూ గాయత్రీ ఉపాసకులై ప్రాణశక్తి అయిన ఆ జగదంబికను ఆరాధించి, శ్వాసని నియంత్రించి చేసినప్పుడు వారి మంత్రమే వారికి గాయత్రి అవుతుంది. గాయత్రి స్వరూపాన్ని వివరిస్తూ ఇక్కడ తల్లి 'సంధ్యా విజ్ఞయా ద్విజాతి జాతి రూపాతా జపరూపా తపస్విని' అన్నారు. 'ద్విజాతి జాతి రూపా' అని స్పష్టం చేసి చెబుతున్నారిక్కడ. ఈవిడ తపస్స్వరూపిణి. గాయత్రి సర్వ సంస్కార స్వరూపం. గాయత్రి లేనప్పుడు విప్రుడికి ఏ అనుష్ఠానమూ ఫలించదు. గాయత్రీ జపం చెయ్యకుండా, సంధ్యావందనం చెయ్యకుండా 'విష్ణు సహస్రం' చేసినా వృథా అవుతుంది అని 'దేవీ భాగవతం' లోనూ, ఇతర పురాణాల లోనూ చెప్పబడింది. అందువల్ల విప్రుడికి ఇది విద్యుక్త ధర్మం.

విప్రుడు గాయత్రి చేసితీరాలి. ఎందుకు చెయ్యాలంటే.... గాయత్రి ద్వారా నిత్యం అర్ఘ్య ప్రదానం చేసి జపం చెయ్యడం వల్ల లోకం క్షేమంగా ఉంటుందట; ప్రకృతి క్షేమంగా ఉంటుందట. అలా ఉంచినందుకు భగవానుడు అతడికి ఏమిస్తున్నాడంటే – "ఆయుః పృథివ్యాం ద్రవిణం బ్రహ్మ వర్చసం మయ్యం దత్తా ప్రయాతుం బ్రహ్మలోకం" – ఆయుష్షు, ద్రవిణం, బ్రహ్మవర్చస్సు." గాయత్రి చెయ్యడం ద్వారా అతడు జగతిని రక్షిస్తున్నాడు. మంత్రశక్తిని వాయుమండలంలోకి పంపి దేవతల్ని తృప్తి పరచి, ఆ దేవతాశక్తి జగతికి కలిగేలాగ చేసే బాధ్యత అతనిది.

అతను అలా చేస్తే తద్వారా అనుగ్రహించి కురిసిన ప్రకృతి, వృష్టి, సమాజ జీవనం – వీటిని రక్షించాల్సిన బాధ్యత క్షత్రియునిది. ఆ వచ్చిన సంపదని అందరికీ పంచేటట్లు న్యాయబద్ధంగా చెయ్యాల్సిన బాధ్యత వైశ్యుడిది. ఈ సంపదనంతటినీ ఉత్పత్తి చెయ్యాల్సిన బాధ్యత శూద్రుడిది. ఇవి బాధ్యతలే కానీ వీటిలో ఎక్కువ తక్కువలు లేనే లేవు. ఎవరి బాధ్యతను వారు సక్రమంగా చెయ్యాలి. ఎక్కువ, తక్కువలని ఏ శాస్త్రమూ చెప్పలేదు. ఇదంతా ఒకే విరాట్ పురుషుని యొక్క శరీరావయవాలు అని 'పురుషసూక్తం' వర్ణిస్తోంది. ఆ సమన్వయాన్ని పరిశీలించాలి.

ద్విజుడి బాధ్యత ఏమిటంటే గాయత్రీ మంత్రాన్ని త్రిసంధ్యలలోనూ జపించడం. అయితే అతను అది చెయ్యాలని చెప్పినప్పుడు ఒక విధమైన ఆందోళనకరమైన వాతావరణం ఏర్పడుతుంటుంది. దానికి కారణం కలికాలం. ఎందుకంటే కలికాలంలో చెవిలో శంఖం పెట్టి ఊదినా వినపడనంత అజ్ఞాన బధిరత్వం కనిపిస్తుంది. "నువ్వు చెయ్యరా'' అని ఎవరికి చెబుతామో, వాడు చెయ్యడం మానేస్తాడు, ''నువ్వు వద్దురా'' అన్నవాడు చెయ్యాలని చూస్తాడు. అది కలిలో ఉన్న లక్షణం. విధిని వదిలెయ్యాలనే బుద్ధి, నిషేధాన్ని ఆచరించాలనే బుద్ధి కలిలో బాగా ఉంటాయి. సంధ్యావందనాదులు చెయ్యకుండా యజ్ఞాలు, హోమాలు, సత్యనారాయణ వ్రతాలు చేసిన ఫలించవు అని 'దేవీ భాగవతం'లో చెబుతున్నారు. సంధ్యావందన కృత్యం చెయ్యని విప్రుడు వేసిన పువ్వులు కూడా దేవత తీసుకోదట! వాడు వదిలిన తర్పణాలు పితృదేవతలు తీసుకోరట. బ్రాహ్మణుడు కనీసం సంధ్యావందనం చెయ్యాలి. చాలామంది ఉపనిషత్తులు చదివి జ్ఞానులమై పోయామనుకుని కర్మ వదిలేస్తారు. వాళ్ళు బ్రహ్మమార్గులు కారు, భ్రష్టమార్గులు. ఇవన్నీ అజ్ఞానం చేత ఏర్పడుతున్న అవస్థలు. ❖ **(సశేషం)**

ఒక సిద్ధాంతాన్నీ, శాస్త్రాన్నీ తెలుసుకొన్నంత మాత్రాన ప్రయోజనం లేదు. వాటిని నిత్యజీవితంలో అమలుపరచుకొనగలగాలి. - మహాభారతం

రామకృష్ణ మఠం & మిషన్

రిమ్స్ ఆసుపత్రి దగ్గర, కడప - 516 002. ఫోన్: 08562-200120, 200633

నగర కేంద్రం: రామకృష్ణ మఠం, ట్రంకు రోడ్డు, కడప - 516 001. ఫోన్: 08562-241633

Email : kadapamath@yahoo.com, website : www.rkm-kadapa.org

విన్నపం

మూర్తిత్రయం యొక్క అపారమైన కృప, భక్తులు, హితైషుల సహాయ సహకారాలతో కడపలోని రామకృష్ణ మిషన్ నాలుగేళ్ళలోనే చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించింది. ప్రస్తుతం కడప శివార్లలో పాలకొండల వద్దనున్న రిమ్స్ ఆసుపత్రి దగ్గర ఉన్న 10 ఎకరాల అత్యంత ఆకర్షణీయమైన ఆవరణలో సేవా కార్యకలాపాలను నిర్వహిస్తోంది.

ముఖ్యమైన కార్యకలాపాలు:

1. ముప్ఫై మంది బాలురున్న ఉచిత వసతిగృహం.
2. కార్యాలయం, గ్రంథాలయం, పుస్తక విక్రయశాల.
3. వివేకానంద విద్యానికేతన్ ప్రాథమిక పాఠశాల.
4. విలువలతో కూడిన విద్యా కార్యక్రమం–విద్యా (VIDYA).
5. వ్యావసాయిక శిక్షణా కార్యక్రమాలు.
6. స్పోకెన్ ఇంగ్లీష్ కోర్స్. 7. నారాయణ సేవ.

వీటితో పాటు నిత్యం పూజ, భజనలు, ప్రవచనాలు, ఆధ్యాత్మిక అంతర్యోగం, ఉచిత పఠనాలయం, ఉచిత హోమియో చికిత్స (వారానికి ఒకమారు) లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ మధ్య కర్నూలు జిల్లాలో వరద బాధితులకు సేవా సహాయక చర్యలను మిషన్ చేపట్టింది.

భక్తులు ఎంతగానో ఎదురుచూస్తున్న భగవాన్ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయానికి 2009 సెప్టెంబర్ 6న రామకృష్ణ మఠం, మిషన్ల ఉపాధ్యక్షులు శ్రీమత్ స్వామి స్మరణానందజీ మహరాజ్ శంకుస్థాపన చేశారు. వీలైనంత త్వరలో సుందరమైన, విశాలమైన ఆలయ నిర్మాణం కావించడానికి మీ అందరి సహాయ సహకారాల్ని కోరుతున్నాం. పాఠశాల భవనానికి ఉపకరణాలు, వాహనాలు (స్కూలు బస్సు మొదలైనవి) సమకూర్చడానికీ, వివిధ విద్యా కార్యక్రమాల నిర్వహణకు శాశ్వత నిధిని ఏర్పాటు చేయడానికీ సంకల్పించాం. ఈ క్రింద సూచించిన పథకాల నిర్వహణ కోసం భక్తులు,శ్రేయోభిలాషుల నుండి విరాళాల్ని కోరుతున్నాం.

నూతన భగవాన్ శ్రీరామకృష్ణ దేవాలయ నమూనా

★ శ్రీరామకృష్ణుల విశ్వజనీన దేవాలయం– రూ. 140 లక్షలు
★స్కూలు ఫర్నీచర్,ఎక్విప్‌మెంట్, 2 బస్సులు–రూ. 25 లక్షలు
★ విద్యాసంస్థల నిర్వహణకై శాశ్వతనిధి– రూ. 100 లక్షలు

విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 (జి) కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. Ramakrishna Mission, Kadapa పేరిట చెక్కు కానీ, డి.డి. కానీ తీసి Ramakrishna Mission, Near RIMS Hospital, Kadapa-516 002 చిరునామాకు పంపగలరు.

భగవత్సేవలో
స్వామి ఆత్మవిదానంద
కార్యదర్శి

Advt.,

పరోపకారం పరమోత్కృష్ట ధర్మం!

మతం యొక్క అసలు రహస్యం ఆచరణ రూపంలో నిరూపితమవుతుంది కానీ సిద్ధాంతాల్లో కాదు. మంచిగా నడచుకోవడం, మంచిని ఆచరించడం – అదే మత సారాంశం. భగవన్నామాన్ని బిగ్గరగా అరవడం మతం కాదు. భగవానుని నిర్ణయాలను అమలు చేయడమే నిజమైన మతం.

నైతిక పథంలో వ్యక్తి సంచరించాలి. వీరోచితంగా నడచుకోవాలి. హృదయపూర్వకంగా కర్తవ్యాన్ని నిర్వహించాలి. సడలని నైతిక పథంలో, భయమెరుగని సాహసంతో వ్యక్తి జీవించాలి.

వ్యక్తి పవిత్రాత్ముడైతే అతడు అపవిత్రతను దర్శించలేడు. దానికి కారణం అతని అంతరంగ ప్రవృత్తే బాహ్యంలో ప్రతిబింబించడం. మన లోపల మలినం ఉంటే తప్ప బాహ్యప్రపంచంలో మలినాన్ని చూడలేం. ఈ విజ్ఞానాంశాన్ని ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాల్లో అనుసరించడం శ్రేయస్కరం.

సర్వజన సంక్షేమం, నైతిక పథ గమనం సాధించాలంటే ముఖ్యంగా స్వార్థరాహిత్యాన్ని అవలంబించాలి. 'నీ కొరకు నేను, నా కొరకు కాదు' అనే భావాన్ని ప్రతి వ్యక్తీ అలవరచుకోవాలి. స్వర్గం, నరకం అనేవి ఉన్నాయో, లేవో ఎవరికీ అవసరం లేదు. ఆత్మపదార్థమనేది ఉందో, లేదో ఆలోచించాల్సిన పని లేదు. 'చిత్తు, సత్తు' అంటూ వాటిని గురించి వితర్కించుకోవాల్సిన పని లేదు. మన ఎదురుగా కనిపించే ప్రపంచాన్ని గురించి మాత్రమే మనం విచారించాలి. ఈ ప్రపంచం అంతా దుఃఖ భూయిష్ఠంగా ఉంది. బుద్ధుడి లాగే మనం కూడా ప్రపంచంలో సంచరించి, ప్రజల కష్టాల్ని రూపుమాపడానికి శాయశక్తులా కృషి చేయాలి. ఆ ఉద్యమంలో మనం ఆత్మాహుతికి కూడా సిద్ధమవ్వాలి. ఒక వ్యక్తి నాస్తికుడా, ఆస్తికుడా, భౌతికవాదా, వేదాంతా, క్రైస్తవుడా, మహమ్మదీయుడా అని విచారించాల్సిన పని లేదు.

పరోపకారం పరమోత్కృష్ట ధర్మం. అలాగే పరపీడనం పరమ నికృష్టకార్యం. పరులను ప్రేమించడం ఉత్తమ లక్షణం కాగా, ఇతరులను ద్వేషించడం హైన్యం. దైవశక్తి పట్ల విశ్వాసం, ఆత్మ విశ్వాసం సద్గుణాలు అవుతాయి. సంశయించే ప్రవృత్తి పాపంగా పరిగణిత మవుతుంది. సమైక్యభావం శ్లాఘనీయం. భేదభావం నైచ్యం అవుతుంది. ❖



సజీవ దైవాలను సేవించండి. అంధుడు, పేదవాడు, వికలాంగుడు, దుర్బలుడు, క్రూరుడు - ఇలా వివిధ రూపాల్లో భగవంతుడు మీ వద్దకు వస్తాడు. - స్వామి వివేకానంద

పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

యం. రాజు, హుజూరాబాద్.

?: 'భగవంతుని శరణాగతి పొందు. అప్పుడు మాత్రమే మహామాయ ఉదారతతో ముక్తికి త్రోవ కల్పిస్తుంది' అన్నారు శారదామాత. శరణాగతి అంటే ఏమిటి?

✍: శరణాగతునికి తనదంటూ ఏ కోరికా ఉండరాదు. అంతా దైవానికి వదిలిపెట్టాలి. ఇది అత్యున్నతమైన స్థితి. దీనికి ముందు సాధకుడు సుదీర్ఘకాలం సాధన, భజనలు, జపం చెయ్యాలి. గురు ముఖతః మంత్రోపదేశం పొందాలి. ప్రహ్లాదుడు శ్రీహరి భక్తుడు. ఎన్ని కష్టాలనైనా శ్రీహరి అండతో భరించాడు. బాల భక్తుడయ్యాడు. ఆచంద్రార్కం ఆయన చరిత్ర నిలిచింది. శ్రీహరిని శరణు పొందడంతోనే అది సాధ్యమైంది. అలాగే మీరాబాయి. సామాన్యంగా వ్యక్తికి ప్రలోభాలు పోవు. మహామాయ అంటే అజ్ఞానం, మనలో ఉండే లౌకికమైన కోరికలు. ముఖ్యంగా కామ, క్రోధ, లోభాలను వదిలిపెట్టి భగవంతుణ్ణే సర్వకాల, సర్వావస్థల్లో ఆశ్రయించి ఉండడం శరణాగతి.

పి. రామారావు, విశాఖపట్నం.

?: 'ఓం, శ్రీం, క్లీం, హ్రీం, నమశ్శివాయ'. ఈ మంత్రం ఏ దేవతలకు సంబంధించినది. నేను శివ కోటి రాస్తున్నాను. శివనామ స్మరణ మంత్రం ఏదైనా ఉందా?

✍: మీరు వ్రాసిన మంత్రం శక్తితో కూడిన శివ మంత్రం. మహేశ్వరుడు, విశ్వనాథుడు, పార్వతీపతి - ఇలా ఆ మహాదేవునికి అసంఖ్యాక నామాలు. ఆయన సహస్రనామాల్లో ఏ పేరు పెట్టి పిలిచినా పలుకుతాడు. శివుడు అంటే అంతా శుభాన్నిచ్చే భోలా శంకరుడు. 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రం చాలా శక్తిమంతమైనది. దాన్నే శివకోటిగా వ్రాయండి. ఆ గౌరీకాంతుని అనుగ్రహం లభిస్తుంది.

సాయిరామానందస్వామి, పొదల కొండపల్లె, ప్రకాశం జిల్లా.

?: కోరికలతో భగవంతుణ్ణి ప్రార్థించకూడదంటారు. కోరకుండా భగవంతుడేమీ చేయడు కదా! ఎలా ప్రార్థించాలి?

✍: 'ప్రార్థన' అంటే ప్రకర్షేణ అర్థనం. చిన్న పిల్లవాడు తను అడిగింది ఇవ్వాల్సిందేనని గీపెట్టి ఏడ్చి, తల్లిని విసిగించైనా కావలసింది పొందుతాడు. అమ్మ తన సొంతమైంది. ఆమెను గాక ఎవరిని అడుగుతాడు! అతనికి అమ్మే తెలుసు. అదే విధంగా భగవంతుణ్ణి ప్రార్థించగలిగితే ఆయన మనం కోరిన వాటిని ఇస్తాడు. మోక్షం కూడా ఆయనే ఇస్తాడు. కానీ, మనం ఇతరమైన కోరికల వల్ల మాయలో పడి ఆయనను మర్చిపోతాం. అందుచేత భగవంతుణ్ణి 'నిర్వాసన - నాకు ఏ కోరికా లేకుండా చెయ్యి' అని ఆంతరంగిక ఆర్తితో ప్రార్థించాలి. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను కోరడం కోరికల్లోకి రాదు.

అమ్మ భవతారిణీ కాళీమాత వద్దకు వెళ్ళి ఏం కోరినా నెరవేరుస్తుందని అత్యంత పేదరికంలో ఉన్న నరేంద్రునితో శ్రీరామకృష్ణ పరమహంస అన్నారు. కాలాంతరంలో స్వామి వివేకానంద అయిన నరేంద్రుడు అమ్మ ఎదుట నిలబడి, నాకు భక్తి, జ్ఞాన వైరాగ్యాలను ఇమ్మన్నాడు. అంతేగానీ ఐశ్వర్యాలు కోరలేదు. నారదుని భక్తికి మెచ్చి, వరం కోరుకోమని శ్రీరాముడు అంటే నాకేమీ వద్దని నారదుడు దాశరథుణ్ణి వేడుకున్నాడు. అయినా రామబ్రహ్మ వదల్లేదట. అప్పుడు నారదుడు నీ జగన్మోహినీ మాయలో పడకుండా నాకు వరం ఇవ్వు అన్నాడు. శ్రీరాముడు విభీషణునికి రాజ్యం, శ్రీకృష్ణ భగవానుడు కుచేలుడికి ఐశ్వర్యాలూ ఇచ్చినట్లు - మనకూ భగవంతుడు కావలసినవన్నీ ఇస్తాడు. ఉపేంద్రనాథ్ కోరిక మేరకు శ్రీరామకృష్ణులు అతనికి ఐశ్వర్యాన్ని ప్రసాదించారు. భగవంతుడు కల్పతరువు. మనం ఏది అడిగితే అది ఇస్తాడు. ఆయనే కావాలని కోరుకుంటే ఆయన మన చెంత ఉంటాడు. "తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు" అని రామదాసు కీర్తించినట్లు మనం దేవుణ్ణే కోరుతూ నిశ్చింతగా ఉండవచ్చు. ❖

ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన...

– శ్రీమతి బి. కృష్ణకుమారి

ఏ రీతిలో కొలిస్తే భగవానుడు ఆ రీతిలో కనిపిస్తాడంటాడు అన్నమయ్య. వారి వారి ఆరాధన, ఆధ్యాత్మిక స్థాయుల్ని బట్టి వారికి ఆ విధంగా ఆ దేవదేవుడు అర్థమవుతాడంటాడు.

అన్నమయ్య పదాలు అచ్చమైన
పనస తొనలు... ఆయన కీర్తనలు
తెలుగుతల్లికి పట్టిన కోరతులు...
ఆ భక్తి పాటలు పారిజాత పరిమళాలు...
ఆ వేంకటాచలపతి కోవెలకు కట్టిన
మంగళతోరణాలు. భాషలోనైనా, భావంలోనైనా
అన్నమయ్య పదాల మాధుర్యం వర్ణనాతీతం.
ప్రతి పదమూ మకుటాయమానమే.
ఆ పుండరీకాంక్షుని పదకమలాలను పదాల
పంచామృతంతో అర్చించాడు,
తన భక్తిభావాల్ని తెలుగు తియ్యదనంతో
అద్ది అభిషేకించాడు అన్నమయ్య.

ఆ వరాహమూర్తి నామము వెల సులభము, ఫలమధిక మంటూ ప్రచారం చేశాడు అన్నమాచార్య. కేవలం పారమార్థిక సత్యాలనే కాకుండా, ఐహిక అంశాలను కూడా పరమాద్భుతంగా వ్యాఖ్యానించాడు ఆ పరమభక్తాగ్రేసరుడు. అంటరానితనం వంటి ఎన్నో అనాచారాలను; ఆస్తిపాస్తుల కోసం చేసే 'వ్యక్తి భజనలను' ఆనాడే ఎండగట్టాడు ఆ వైతాళికుడు. ఆ పరంపరలో భగవంతుడి తత్త్వాన్ని పదకవితా పితామహుడు అన్నమాచార్య **'ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన...'** అన్న కీర్తనలో అద్భుతంగా వర్ణించాడు. ఎవరు

పిండంతే నిప్పటి...

ఈ కీర్తనలో అచ్చమైన తెలుగు పలుకుబడుల్ని ప్రయోగించడమే కాకుండా కొన్ని కొత్త పదాల్ని పరిచయం కూడా చేశారు. 'పిండి కొద్దీ రొట్టె' అని మనం సాధారణంగా అంటూ ఉంటాం; కానీ ఇక్కడ అన్నమయ్య 'పిండంతే నిప్పటి'

అన్నమయ్య పదామృతం

ఎంత మాత్రమున ఎవ్వరు దలచిన అంత మాత్రమే నీవు
అంతరాంతరములెంచి చూడ పిండంతే నిప్పటి యన్నట్లు ॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికు లాదిభైరవుండనుచు ॥

సరినెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానా విధులను తలపుల కొలదుల భజింతురు
సిరుల మిమునే యల్పబుద్ధి దలచిన వారికి అల్పంబవుదువు
గరిమల మిము నే ఘనమని దలచిన ఘన బుద్ధులకు ఘనుడవు॥

నీ వలన కొరతే లేదు మరి నీరు కొలది తామెరవు
ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే ఊరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము చేకొని వున్నదైవమని
ఈ వలనే నీ శరణననెదను ఇదియే పరతత్త్వము నాకు॥

అన్నారు. నిప్పటి అంటే నిప్పుపై కాల్చే రొట్టె. అంటే ఇప్పటి మన నిత్యజీవితంలోని 'పుల్కా'కు అది అచ్చమైన తెలుగుపదం.

అంతరాంతరములెంచి చూడ పిండంతే నిప్పటి అన్నట్లు....

పిండి కొద్దీ నిప్పటి ఎట్లాగో నీవు కూడా వారి ఆలోచనా స్థాయిని బట్టి అర్థమవుతావని ఆ వేంకటేశ్వరుడికి విన్నవించుకుంటున్నాడు అన్నమాచార్య.

మిగతా 30వ పేజీలో...

మహనీయుల బోధలు వారి నోటి నుండి వచ్చుచున్నట్లు మనకు అనిపించును.
కానీ ఆ బోధలు నిజముగా భగవంతుని వద్ద నుండియే వచ్చుచున్నవి. - శ్రీరామకృష్ణ పరమహంస

మహాత్ముల త్యాగఫలం - కావేరీ నది ఆవిర్భావం

కథ: టి.ఎం.ఎస్ బొమ్మలు: గోవి అనుసృజన: స్వామి జ్ఞానదానంద




5
అగస్త్య మహర్షి తన కమండలంలో బంధించిన కావేరీ నదిని వినాయకుడు కాకిగా వచ్చి కమండలాన్ని త్రోసి పడవెయ్యడం ఐతిహ్యం. కాంతమన్ ఆలోచనల్లో కొత్త ఉత్సాహాన్ని భగవంతుడు కల్పించాడు. ఆ మేరకు, తల కావేరిలో నెలకొని ఉన్న అగస్త్య మహర్షి ఆశ్రమానికి రాజు వెళ్ళి, మహర్షిని దర్శించాడు.
6
మహారాజా! నీ రాజ్యంలో ప్రజలంతా క్షేమమే కదా!
రాజ్యంలో ప్రజలంతా క్షేమంగా ఉండాలనే మీ కరుణను ఆశించి వచ్చాను స్వామీ! కావేరీ నదీమతల్లి చోళరాజ్యంలో ప్రవహించి రాజ్యానికీ, ప్రజలకూ శ్రేయస్సు కలిగించాలి. అనుగ్రహించండి మహర్షీ!
7
రాజా! మంచి విషయమే అడిగావు. భగీరథుడు గంగను తోడ్కొని వెళ్ళినట్లు కావేరిని తీసుకుపోవాలనుకుంటున్నావు. కావేరీ నదీమతల్లిని ప్రార్థించు, ఆమె వస్తుంది.
మహర్షీ! ధన్యుడనయ్యాను. మీ అనుగ్రహాన్ని చోళరాజ్యం ఎన్నడూ మరచిపోదు.
రాజు ముందు వెళ్తుండగా, కావేరీనది పరవళ్ళుతొక్కుతూ ఆయనను అనుసరించింది.
8
కుంభకోణం వద్దకు కావేరీనది వచ్చినప్పుడు, స్వామిమలై సమీపంలో ఉన్న ఒక మహాబిలంలోకి నీరంతా వెళ్ళిపోసాగింది. కావేరీమాత అదృశ్యమైంది.
కావేరీ మాతా! ఇదేం పరీక్ష!

మిగతా 36వ పేజీలో...

ఆది శంకరుల అమృతఫలాలు

– శ్రీమతి గరిమెళ్ళ లక్ష్మి

అపర శంకరుని అవతారమైన శ్రీశంకర భగవత్పాదులు కారణజన్ములు. తొమ్మిదేళ్ళ ప్రాయంలోనే సన్న్యసించి, పదహారేళ్ళ లోపే వేదాంత రహస్యాలకు భాష్యాలు వ్రాశారు. అద్భుతమైన కవితాశక్తితో ఆసేతు హిమాచలంలోని ప్రతి దైవీ – దేవతా క్షేత్రంలో ఆ క్షేత్రపాలకులైన దైవాలనూ, దైవీ మూర్తులనూ కీర్తిస్తూ స్తోత్రాలు, అష్టకాలు, సర్వదేవతా స్తోత్రాలు ముందు తరాల వారికి అందించిన మహానుభావుడు ఆయన.

దశశ్లోకి: నర్మదానదీ తీరంలోని ఒక గుహలో గోవింద భగవత్పాదుల వారిని శంకరులు కలుసుకున్నారు. "నీవు ఎవరు" అని అడిగిన గురువు గారికి 'దశశ్లోకి' అనే 10 శ్లోకాలలో – తాను ఈ శరీరాన్ని కాననీ, పరమాత్మ స్వరూపుడననీ చెప్పారు. గోవింద భగవత్పాదుల వారు ఆనందించి శంకరులకు సన్న్యాసదీక్షను ప్రసాదించారు.

బ్రహ్మసూత్ర భాష్యం: ఒకమారు నర్మదా నదికి వరదలు రావడంతో గోవింద భగవత్పాదుల ఆశ్రమం కూడా మునిగి పోయే పరిస్థితి వచ్చింది. శంకరులు అది గ్రహించి తన కమండలాన్ని నర్మదా నదికి అభిముఖంగా నేలపై పెట్టి నిశ్చలంగా ధ్యానం చేస్తూ కూర్చున్నారు. ఆ కమండలం వరద నీటిని ఆకర్షించడంతో ఆశ్రమానికీ చుట్టుపక్కల గ్రామాలకీ వరద ప్రమాదం తప్పింది. బయటకు వచ్చిన గోవింద భగవత్పాదులు జరిగింది గ్రహించారు.

వ్యాసమహర్షి అంతక్రితమే గోవింద భగవత్పాదులతో "నర్మదానది వరద ఆపగలిగిన వ్యక్తి బ్రహ్మసూత్రాలకీ, ఉపనిషత్తులకీ, భగవద్గీతకీ (ప్రస్థాన త్రయానికి) వ్యాఖ్యానం వ్రాయగల మహోన్నతుడు" అని చెప్పారు. అది గుర్తుకు వచ్చి శంకరులకు ఆ బాధ్యతను అప్పగించారు గోవింద భగవత్పాదులు.

లఘుస్తోత్రం: ఆ తరువాత శంకరులు కాశీయాత్రకు బయలు దేరారు. తోవలో ప్రభాకరుడనే వ్యక్తి మూగవాడైన తన కొడుకును శంకరుల దగ్గరకు తెచ్చి అతడి మూగతనం పోగొట్టాల్సిందిగా వేడుకున్నాడు.

అప్పుడు శంకరులు అమ్మవారిపై ఒక 'లఘు స్తోత్రం' ఆశువుగా చెప్పారు. తన చేతిని (హస్తం) ఆ బాలుని శిరస్సు మీద ఉంచి (హస్తమస్తక ప్రయోగం) "నువ్వెవరివి నాయనా" అని ప్రశ్నించారు. వెంటనే ఆ బాలుడికి మాటలు వచ్చాయి. "స నిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా" – 'నిత్య సత్య స్వరూపుడనైన ఆత్మను నేను' అని శ్లోకాల రూపంలో ఆ బాలుడు జవాబిచ్చాడు. అప్పుడు శంకరులు ఆ బాలుడికి 'హస్తామలకుడు' అని పేరు పెట్టి సన్న్యాస దీక్ష ఇచ్చారు. ఆ శ్లోకాల కృతికి స్వయంగా శంకరులే భాష్యం వ్రాసి, ఆ కృతికీ – కృతికర్తకూ అపూర్వమైన గౌరవం ప్రసాదించారు.

చర్పాస్తుతి: అలాగే మరొక శిష్యుడు పుట్టుకతో చెవిటివాడు. అతడి చెవిలో 'చర్పాస్తుతి' అనే అమ్మ వారి స్తోత్రం చదువుతూ అతడి చేత పలికించారు. అతడికి వినికిడి శక్తి వచ్చింది. కాలనాథుడు అనే మరొక శిష్యుడు 'తోటకాష్టకం' అనే స్తోత్రం తోటక వృత్తంలో చెప్పాడు. అతనికి తోటకాచార్యుడు అనే పేరుతో సన్న్యాస దీక్షను అనుగ్రహించారు.

కాగా ఆది శంకరుల వారికి ప్రథమ శిష్యుడు కాశీలో లభించాడు. ఆది శంకరులను దైవంగా నమ్మిన అనన్య భక్తుడు విష్ణుశర్మ. ఇతనికి సనందుడు అని పేరు పెట్టి సన్న్యాసదీక్షను అనుగ్రహించారు.

భజగోవింద స్తోత్రం: శంకరుల వారికి మొత్తం పధ్నాలుగు మంది శిష్యులు. శంకర భగవత్పాదులు వ్రాసిన 'భజగోవింద ద్వాదశ మంజరికా స్తోత్రం' శ్లోకాలకు ఈ పధ్నాలుగు మందీ ఒక్కొక్క శ్లోకం చెప్పి, మొత్తం 26 శ్లోకాలుగా భజగోవింద శ్లోకాలను చేశారు. ❖

(మే 18, మంగళవారం ఆదిశంకరాచార్య జయంతి)

అభయ ప్రదం నృసింహ వ్రతం

– ఆంధ్ర శేషగిరిరావు

'స్మృతి దర్పణం', 'గదాధర పద్ధతి', 'పురుషార్థ చింతామణి', 'చతుర్వర్గ చింతామణి' మొదలైన గ్రంథాలన్నీ వైశాఖ శుక్ల చతుర్దశిని 'నరసింహ చతుర్దశి వ్రతదినం'గా పేర్కొంటున్నాయి. కాగా ఈనాడే 'నృసింహ జయంతి' అని కంఠోక్తిగా చెప్పవచ్చు.

నరసింహావతార కథ : విష్ణుమూర్తి పది అవతారాలలో నరసింహావతారం నాలుగోది. హిరణ్య కశిపుడు రాక్షసరాజు. అతని భార్య లీలావతి. ఆమె గర్భవతిగా ఉండగా హిరణ్యకశిపుడు తపస్సుకు వెళ్ళాడు. అదే మంచి అదనుగా దేవతల రాజు ఇంద్రుడు రాక్షస సంహారం ప్రారంభించాడు. లీలావతి గర్భంలో ఉన్న పిండాన్ని కూడా చంపడానికి ప్రయత్నించాడు. అప్పుడు నారదుడు అడ్డుపడి ఆమెను తన ఆశ్రమానికి తీసుకువెళ్ళి కాపాడాడు. ఆమె గర్భస్థశిశువుకు విష్ణుభక్తిని బోధించాడు.

తపస్సు వల్ల బ్రహ్మను మెప్పించిన హిరణ్యకశిపుడు తనకు నరులచే కానీ, మృగములచే కానీ, పగలు కానీ, రాత్రి కానీ, ప్రాణమున్న వాటితో కానీ, ప్రాణము లేని వాటితో కానీ చావు లేకుండా ఉండేలా వరాలు పొందాడు.

ఆ తరువాత అతడు ఇంటికి తిరిగి వచ్చాడు. తాను లేనప్పుడు తన భార్యను అరసి రక్షించినందుకు నారదునకు కృతజ్ఞత తెలిపాడు. భార్యను ఇంటికి తీసుకువెళ్ళాడు. పుట్టిన బిడ్డడికి ప్రహ్లాదుడు అని పేరు పెట్టాడు.

అయితే, వరగర్వంతో హిరణ్య కశిపుడు దేవతలను బాధ పెడుతూ వచ్చాడు. అతడు విష్ణుద్వేషి, అతని కుమారుడు విష్ణుభక్తుడు. కొడుకు మనస్సును మార్చడానికి తండ్రి అనేక విధాల ప్రయత్నించాడు. కానీ ఫలితం లేకపోయింది. చివరకు ప్రాణం విసిగి, 'విష్ణువు ఎక్కడ ఉన్నాడు?' అని తండ్రి, కొడుకును అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు

ఇందు గలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలడు దానవాగ్రణి వింటే!

అన్నాడు. 'అలా అయితే ఈ స్తంభంలో విష్ణువు ఉన్నాడా?' అని హిరణ్యకశిపుడు ఒక స్తంభాన్ని విరగ తన్నాడు. అప్పుడు ఆ స్తంభం విచ్చుకొని పోయి, అందులో నుంచి నరసింహ రూపంలో విష్ణుమూర్తి బయటకు వచ్చాడు.

బ్రహ్మ ఇచ్చిన వరాలకు ప్రత్యవాయం లేకుండా సగం మనిషి, సగం మృగం రూపు ధరించి పగలూ, రాత్రీ కాని సంధ్యా కాలంలో, ప్రాణం ఉన్నవని కానీ లేనివని కానీ చెప్పడానికి వీలు లేని గోళ్ళతో చీల్చి ఆ రాక్షసుణ్ణి నరసింహస్వామి చంపివేశాడు.

నృసింహ చతుర్దశి వ్రతం:

"ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం నృసింహం భీషణం భద్రం మృత్యో ర్మృత్యుర్ నమామ్యహం" – అనే మంత్రంతో ఈ రోజున నరసింహమూర్తిని పూజిస్తే శత్రుజయం కలుగుతుంది. నృసింహ చతుర్దశి వ్రతాన్ని 'హేమాద్రి', 'నృసింహ', 'స్కాంద' పురాణాలు వివరిస్తూ ఉన్నాయి.

ఎప్పుడు చేస్తే శ్రేష్ఠం?: "వైశాఖ శుక్ల చతుర్దశి సోమవార స్వాతీనక్షత్రం ప్రదోషకాలంలో నృసింహస్వామి అవతరించాడు. స్వాతీ నక్షత్రం, శనివారం, సిద్ధియోగంలో, వణిజమనే కరణంలో ఈ వ్రతం చేయడం పరమ శ్రేష్ఠం.

వ్రత విధానం: వైశాఖ శుక్ల చతుర్దశి నాడు ఈ వ్రతం చేయాలి. గోమయ శుద్ధమైన ఇంట అష్టదళ పద్మం పెట్టి, కలశ స్థాపన చేయాలి. ఆ కలశం మీద బియ్యంతో నిండిన వెదురు గొట్టం ఉంచాలి. అక్కడ లక్ష్మీనారాయణుల విగ్రహాలు ఉంచాలి. శాస్త్రాచారం ప్రకారం వ్రతం జరపాలి. ఆ కాలంలో దొరికే పూలతో పూజ చేయాలి. రాత్రి జాగరణ చేసి, పురాణ కాలక్షేపం చేయాలి. మరునాటి ఉదయం తిరిగి పూజ చేయాలి. తరువాత యథాశక్తి నృసింహ ప్రతిమా దానం, అన్నదానం చేయాలి. పానకం నరసింహస్వామికి ప్రియమైన నివేదన.

విధ్యుక్త నృసింహ జయంతిని జరపడం వల్ల సకల శుభాలూ కలుగుతాయి. హంపీలోని దేవాలయం చాలా గొప్పది. జయపుర సంస్థానంలో ఖండేలా అనే చోట పన్నెండు చేతులు గల అపూర్వ నృసింహ విగ్రహం ఉంది. ❖

ఆధ్యాత్మిక ప్రగతి అహంకారాన్ని నిర్మూలించి సాధకుణ్ణి వినయంగా ఉండేటట్లు చేయాలి. దానికి బదులు కొందరు కొంత సాధన చేసిన తరువాత ఇతరుల కన్నా తాము అధికులమని తలుస్తారు. ఇదే ప్రమాదకరం. - స్వామి రామదాసు

ఓ మహాత్యాగి ఆత్మకథ

(స్వామి వివేకానంద స్వీయ వచనాల సమాహారం)

(మహా భక్తుడు, అద్వైత వేదాంతి, కర్మయోగి, మహా ప్రవక్త, శ్రేష్ఠసన్యాసి, గురువు, యుగాచార్యుడు, పరమహంస శిష్యుడు, మానవ జాతి ప్రేమికుడు, మహా దేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, మహాయోగి, గంధర్వ గాయకుడు - ఇలా విభిన్న రూపాలలో స్వామి వివేకానంద మనకు దర్శనమిస్తారు. స్వామీజీ తన సంభాషణలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, లేఖల్లో స్వయంగా తెలిపిన జీవితానుభవాలను 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.)

(...గత సంచిక తరువాయి)

నా జీవితంలో ఎన్నోసార్లు ఆయన (శ్రీరామకృష్ణుల) కృపాకటాక్షాలు లభించాయి. ఆయనే నా వెనుక ఉండి నా చేత ఈ పనులన్నీ చేయిస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ నిస్సహాయంగా ఒక చెట్టు క్రింద పడి ఉన్నప్పుడూ, కట్టుకోవడానికి కౌపీనం కోసమైనా నా దగ్గర ఒక్క గుడ్డ పీలిక కూడా లేనప్పుడూ, చిల్లి గవ్వ కూడా లేకుండా ప్రపంచమంతా పర్యటించడానికి నేను సంకల్పించినప్పుడూ అన్ని వేళలా అన్ని విధాలా శ్రీ రామకృష్ణుల కృపాశీస్సులతో సహాయం లభించింది. మళ్ళీ (అమెరికా) చికాగో నగర వీధులలో ఈ వివేకానందుని దర్శన మాత్రానికై జనం గుంపులు గుంపులుగా ఒకరినొకరు తోసుకుంటూ వచ్చినప్పుడు కూడా శ్రీగురుదేవుల కృపాకటాక్షం నాపై ఉన్నందువల్లే ఆ గౌరవ మర్యాదల్ని ఏ సమస్యా లేకుండా నేను జీర్ణించుకోగలిగాను. అందులోని నూరోవంతు పేరు, ప్రతిష్ఠలు చాలు, ఏ సామాన్య వ్యక్తినైనా పిచ్చివాణ్ణి చేయడానికి! ఆయన ఇచ్ఛానుసారమే సర్వత్రా విజయం లభించింది.

శ్రీరామకృష్ణులు బాహ్యంలో భక్తి పూర్ణులు, అంతరంగంలో జ్ఞానపూర్ణులు; నాది బాహ్యంలో జ్ఞానం కానీ హృదయాంతరాళంలో భక్తి నిండి ఉంది. నా జీవితంలో మనసా, వాచా, కర్మణా నేను ఏదైనా సాధించి ఉంటే, నా నోటి నుంచి ఎన్నడైనా, ప్రపంచంలో ఒక్కరికైనా మేలు చేసిన ఒక్క మంచి మాటైనా జాలువారి ఉంటే, అది నాది కాదు, అది మా గురుదేవులదే! కానీ ఒకవేళ నా నోటి నుండి శాపాలు వచ్చి ఉంటే, నా నుండి ద్వేషం కురిసి ఉంటే అదంతా నాదే! వారిది కాదు!! బలహీనమైనదంతా నాదే; జీవన దాయకం, శక్తి ప్రదాయకం, పవిత్రం, పరమ పావనం అయినదంతా ఆయన ప్రేరణే, ఆయన అమృతవాక్కులే. స్వయంగా ఆయనే!

శ్రీరామకృష్ణులు వారికి వారే సాటి. ఆయనకు సమానులు కానీ, ఆయన కన్నా గొప్పవారు కానీ ఎవరైనా ఉన్నారా? నేను ఆయన భూతగణాలలో ఒక్కరినై ఉండవచ్చు, వారి సన్నిధిలోనే కొన్నిసార్లు నేను ఆయనను గురించి తప్పు పట్టి మాట్లాడే వాణ్ణి; అంతా విని ఆయన నవ్వేవారు! నిజంగా చెబుతున్నాను. నేను గురుదేవుల్ని చాలా కొంచెమే అర్థం చేసుకున్నాను. ఎప్పుడైనా ఆయనను గురించి ఏదైనా మాట్లాడాలంటే నాకు భయం! ఎందుకంటే సత్యాన్ని ప్రక్కన పెట్టి ఏదో చెప్పేస్తానేమోననీ, నా కొద్దిపాటి శక్తి అందుకు చాలదేమోననీ వారి మహత్త్వాన్ని అభివర్ణించే ప్రయత్నంలో, నా అల్పబుద్ధి ప్రకారం ఆయన మహోన్నత జీవితాన్ని చిత్రించి, తద్వారా వారిని జనం ముందు చిన్నగా చేసేస్తానేమోననీ నాకు భయం! శ్రీరామకృష్ణులు ఎంత గొప్పవారో నాకు పూర్తిగా తెలియదు!

ఆయన విషయమే వేరు. వారికీ, సామాన్య మానవులకూ ఎక్కడ, ఏం పోలిక! సకల మతాల సాధనలూ ఒకే సత్యం దగ్గరికే దారి చూపుతాయని నిరూపించడానికై ఆయన తన నిజజీవితంలో సర్వధర్మాల, మతాల వివిధ ఆదర్శాలనూ సాధన చేశారు. ఆచరించి చూపారు. వారు చేసిన సాధనలన్నీ మనం ఎన్నడైనా చేయగలమా? మన మెవ్వరమూ ఆయనను పూర్తిగా అర్థం చేసుకోలేదు. కనుకనే నేను ఆ గురుదేవుల గురించి ఎక్కడబడితే అక్కడ మాట్లాడడానికి సాహసించను. ఆయన నిజంగా ఎవరో, స్వయంగా ఆయనకే తెలుసు.

ఆయన ఒక్క కృపాకటాక్ష వీక్షణ మాత్రం చేతనే వేలాది మంది వివేకానందులు ఉద్భవించగలరు. కానీ అలాకాక, ఈ సారి తమ కార్య నిర్వహణకై నన్ను తమ ఏకైక సాధనంగా ఎంచుకున్నారు.

ఈ ప్రపంచమంతా తిరిగి ఇది గ్రహించాను; కేవలం శ్రీరామకృష్ణుల శిష్య, భక్త వర్గంలో తప్పితే, తక్కిన ప్రతీచోటా



ఆలోచన - ఆచరణలు ఆమడదూరంలో ఉంటున్నాయి. (మాటలకూ, చేతలకూ పొంతన లేదు). ఆయన శిష్యులు, భక్తులపైన నాకు అత్యంత ప్రేమ, పరిపూర్ణ విశ్వాసం ఉన్నాయి. మీరు నన్ను 'ఏక పక్షపాతి' అనుకోవచ్చు, కానీ ఇదే యథార్థంగా నా ఆఖరి మాట! శ్రీరామకృష్ణులకు శరణాగతుడైన ఒక భక్తుని కాలికి ముల్లు గుచ్చుకుంటే, అది నా గుండెల్లో నొప్పి కలిగిస్తుంది! మిగిలిన అందరినీ నేను ప్రేమిస్తాను; నాలా విశాల భావాలు కలిగి, సకల మతాలనూ సమానంగా గౌరవించే భక్తులు, నీకు చాలా కొద్దిమందే కనిపిస్తారు. నాకు స్వల్ప మూఢ భక్తి ఉంది! ఆ మహాత్ముని పేరుతోగాక వేరెవ్వరి పేరు మీద విన్నవించుకోను? మనకు మరు జన్మలో మరోపెద్ద గురువును వెతకడానికి చాలినంత సమయం దొరుకుతుంది; కానీ ఈ జన్మకు మాత్రం నిరక్షర

కుక్షి అయిన ఆ బ్రాహ్మణుడే నన్ను శాశ్వతంగా స్వాధీనం చేసుకున్నాడు!

శంకరాచార్యులకు మహా మేధ, రామానుజాచార్యులు, చైతన్య మహాప్రభువులకు మహోన్నత హృదయమూ ఉండేవి. ఈ రెండూ - మహామేధ, మహోన్నత హృదయమూ కలగలిసిన ఒక మహాయుగ పురుషుడు అవతరించాల్సిన సమయం ఆసన్నమైంది.

శ్రీరామకృష్ణుల చిన్నతనంలోనే వారి తండ్రి పరమ పదించారు. ఆ బాలుడు పాఠశాలకు వెళ్ళసాగాడు... ఎందరో పండితులు ఒక సభలో వాదోపవాదాలు చేసుకోవడం చూసి, ఆ బాలుడు ఈ నీతి నేర్చుకున్నాడు. "వారి సమస్త శాస్త్రజ్ఞానం యొక్క ఫలితం ఇదీ! వారంతా గట్టిగా ఎందుకు పోట్లాడుకుంటున్నారు? అది కేవలం డబ్బు కోసమే! ఎవరైతే ఈ వాదనలో ఉత్తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారో వారికి విలువైన వస్త్రాలు లభిస్తాయి. కేవలం దాని కోసమే వీరంతా వాదులాడుకుంటున్నారు! సరి, ఇక నేను పాఠశాలకు వెళ్ళనే వెళ్ళను!" ఇలా నిర్ణయించుకున్న ఆ బాలుడు నిజంగా తరువాత బడికి వెళ్ళలేదు, బడికి వెళ్ళడం అదే ఆఖరు!...

దక్షిణేశ్వరం (కలకత్తాలో) భవతారిణీ కాళికాదేవి ఆలయంలో 'ఆనందమయి' అమ్మవారి విగ్రహం ఉంది. ఈ బాలుడు ఉదయం, సాయంత్రం ఆ అమ్మవారి విగ్రహానికి పూజ, అర్చన చేయాల్సి వచ్చింది. అలా పూజ చేస్తూ, చేస్తూ మెల్లమెల్లగా ఈ భావాలు అతని మనస్సులో ఉదయించ సాగాయి: "ఈ విగ్రహం వెనుక ఏమైనా నిజం ఉందా? ఈ విశ్వంలో ఒక 'ఆనందమయి' అమ్మవారు ఉన్నారనడం సత్యమేనా? 'ఆ అమ్మ నిజంగా ఉంది, ఈ విశ్వాన్ని నడిపిస్తోంది' అనడం సత్యమేనా? లేక ఇదంతా కల లాంటి కల్పన మాత్రమేనా? మతం (ఆధ్యాత్మికత)లో ఏమైనా సత్యం ఉందా?"...

దిన దినమూ శ్రీరామకృష్ణులు ఆలయంలో కాళీమాత ముందు ఏడుస్తూ ఇలా ప్రార్థించేవారు: "అమ్మా! నీవు నిజంగా ఉన్నావా తల్లీ! లేక అంతా కల్పనేనా? 'ఆనందమయి జగజ్జనని' అన్నది కేవలం కవులు, మతి తప్పిన వ్యక్తుల కల్పన మాత్రమేనా? లేక ఇందులో ఏమైనా నిజం ఉందా?" అమ్మనే ఇలా ప్రశ్నించేవారు: "అమ్మా! నీవు ఉన్నావనే మాట నిజమేనా? మరి నీవెందుకు కనిపించవు? ఎందుకు మాట్లాడవు? నీవు చచ్చిపోయావా?"... ఆ తరువాత ఆయన పూజ చేయడం అసంభవమైపోయింది. దగ్గరలోని అడవిలో ఏకాంతంగా అమ్మ కోసం విలపించసాగాడు. ఎన్నో పగళ్ళూ, రాత్రులూ గడిచిపోయాయి! రోజంతా గడిచిపోయి, సాయం సంధ్యా ఆరతి గంటలు, పాటల శబ్దం తన చెవులకు వినిపించగానే, ఆ యువకుడు ఎంతో తీవ్రమైన బాధతో, "అమ్మా! ఈ అల్పజీవితంలో ఇంకొక రోజు వృథాగా గడిచిపోయింది. కానీ నీ దర్శనం మాత్రం ఇంకా కాలేదు తల్లీ!" అంటూ ఆత్మ క్షోభతో కొన్నిసార్లు ఆయన తన ముఖాన్ని నేలకు రాచుకుంటూ ఇలా ఏడ్చేవారు: "ఓ జగజ్జననీ! నాకు సాక్షాత్కరించు తల్లీ! దర్శనమీయి తల్లీ! నీవు తప్ప నాకింకేమీ వద్దు జననీ!"... ❖ (సశేషం)

అనుసృజన : స్వామి అర్చనానంద

తన మనస్సును తాను వశపరచుకొనగలిగినవాడు
సహస్ర శత్రువులను ఓడించిన వాడి కంటే గొప్పవాడు. - గౌతమ బుద్ధుడు

మంత్రం పరమార్థం

– ఆకెళ్ల రాఘవేంద్ర

వేదాలు, ఉపనిషత్తులు మొదలైనవి మన భారతీయతకు మూలస్తంభాలు. వాస్తవానికి వేదోపనిషత్తుల్లో ఏమున్నాయి? ఆధ్యాత్మికతా? ఆత్మజ్ఞానమా? భగవత్ తత్త్వమా? ఇవన్నీ ఉన్నాయి. వీటన్నింటికీ మించి మనిషి తన జీవితాన్ని ఫలవంతం చేసుకోవడానికి సంబంధించిన అంశాలూ ఉన్నాయి. మానవ వ్యక్తిత్వ, జీవన వికాసానికి దోహదపడే విషయాలూ ఉన్నాయి. మనిషిలోని ఆత్మశక్తి ద్విగుణీకృతం అయ్యేందుకూ, మూర్తిమత్వం వికసించేందుకూ సహాయపడే బోధలూ ఉన్నాయి. నాటికైనా, నేటికైనా, ఏనాటికైనా మానవ వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించేవే వేదోపనిషత్తులు.

మనం ఏ పని చేయాలన్నా, ఏ విజయం సాధించాలన్నా బుద్ధి స్పష్టత ఉండాలి. లక్ష్యం పట్ల ఎంత స్పష్టత ఉంటే, మార్గం అంత సుగమం అవుతుంది. అసలు ఋగ్వేదంలోని 'గాయత్రీ మంత్రం' నిర్దేశించేది ఈ బుద్ధి స్పష్టత గురించే! 'ఎవరు మన బుద్ధిని ప్రేరేపిస్తారో, ఆ దైవాన్ని ధ్యానిద్దాం' అంటుంది మంత్రం. "ఓం భూర్భువస్సువః" అంటూ సాగే ఈ మంత్రం "ధియో యోనః ప్రచోదయాత్" అనడానికి కారణమదే!

ఒక వ్యక్తి జీవితాన్ని సాఫల్యం చేసుకోవడానికి కావలసిన మరో ఆయుధం దృఢసంకల్పం. ఎవరికి సంకల్పం దృఢంగా ఉంటుందో వారికి విజయం తథ్యం. "నేను ఎలాగైనా విజయం సాధించాలి, ఎన్ని అవరోధాలు వచ్చినా సాధించి తీరాలి" అని అనుకోవడమే సంకల్పబలం. మానవుడికి అలాంటి సంకల్ప శక్తినీ, సిద్ధినీ అందించే 'సంకల్ప సూక్తమ్' మన 'శుక్ల యజుర్వేదం'లో ఉంది.

"ఓం యజ్ఞాగ్రతో దూరముదైతి దైవం..." అంటూ సాగే ఈ 'సంకల్ప సూక్తమ్' ఏం చెబుతోందంటే – "అనంత దూరాలను చేరుకొనేదీ, యావత్ ప్రకాశానికీ ప్రకాశంగా భాసిల్లుతున్నదీ, అద్వితీయమైనదీ అయిన ఆ ఆత్మ – నా మనస్సును సత్సంకల్పం చేసేలా ప్రేరేపించు గాక! ఏ ఆత్మ ప్రజ్ఞానం, జ్ఞాపకశక్తి, మనోస్థైర్యం వంటి వాటికి ప్రాప్తిస్థానమో, ఏ ఆత్మ ప్రాణుల యొక్క నశించని జ్యోతిస్వరూపంగా భాసిల్లుతూ ఉన్నదో, ఏది లేకుండా ఏ పనీ చేయజాలమో – ఆ ఆత్మ నా మనస్సును సత్సంకల్పం చేసేలా ప్రేరేపించు గాక!"

పై మాటలలో ఆత్మశక్తి గొప్పతనం కూడా ప్రస్తావితమైంది. ఆత్మ అనే భావనను నేటి ఆధునిక మానవుడు అర్థం చేసుకోవాలి. మనలో నిబిడీకృతమై ఉన్న శక్తే – ఆత్మ. మరణం లేని అనంత తత్త్వమే– ఆత్మ. శుక్ల యజుర్వేదంలో 'శక్తిమంత్రం' – ఈ ఆత్మశక్తి గురించే వివరిస్తోంది.

"ఓం తేజోసి తేజోమయి దేహి..." అని సాగే ఈ శక్తిమంత్రం – "భగవంతుడా! నువ్వు ఆత్మశక్తిగా ఉంటున్నావు, నాకు ఆత్మశక్తిని ప్రసాదించు! నువ్వు సంయమశక్తిగా ఉంటున్నావు, నాకు సంయమ శక్తిని చేకూర్చు! నువ్వు శారీరక శక్తిగా ఉంటున్నావు, నాకు శారీరక శక్తిని ప్రసాదించు! నువ్వు ధైర్యంగా భాసిల్లుతున్నావు, నాకు ధైర్యాన్ని ప్రసాదించు! నువ్వు సహనశీలిగా ఉంటున్నావు, నాకు సహనాన్ని ప్రసాదించు!" అంటోంది.

ఈ మంత్రం ఆత్మశక్తి గురించే కాదు ధైర్యం గురించీ చెబుతోంది. ఏ పని అయినా ఒక వ్యక్తి చేయాలనుకోవాలన్నా, చేయాలన్నా, కార్యరంగంలోకి దూకి ముందుకు వెళ్ళాలన్నా, విజయం సాధించాలన్నా – తప్పనిసరిగా కావలసింది ధైర్యం. అందుకే ధైర్యలక్ష్మిని కొలవాలన్నారు పెద్దలు.

ఏ పని అయినా చేయాలని సంకల్పించినా, ధైర్యంగా అడుగులు ముందుకు వేసినా – మార్గమధ్యంలో అవరోధాలు ఎదురు కావడం సహజం. అలాంటి అడ్డంకుల్ని అధిగమించేందుకు మనిషి కృషి చేయాలి. 'తైత్తిరీయ ఆరణ్యకం'లోని 'దుర్గా సూక్తమ్'లో "అరాతీయతో నిదహాతి వేదః" అని

ఉంది. అంటే "జీవితంలో ఎదురయ్యే అడ్డంకుల్ని అగ్నిదేవుడు దగ్ధం చేయుగాక!" అని అర్థం.

పెద్దలతో నమ్రతగా ప్రవర్తించడానికి సంబంధించి కావచ్చు, దైవభక్తికి సంబంధించి కావచ్చు, సాటివారి పట్ల దయతో ఉండడం గురించి కావచ్చు, మాటతీరులోని మెత్తదనం గురించి కావచ్చు – ఇలా అనేకానేక ప్రవర్తన నియమావళులు ఉన్నాయి. ఉదాహరణకు–

"జిహ్వామే మధుమత్తమా, కర్ణాభ్యాం భూరి విశ్రువమ్" అంటుంది వేదం. అంటే 'నా నాలుక అతి తియ్యని మాటలనే పలుకనీ! నా చెవులు మంచి విషయాలనే ఆలకించనీ!' అని అంటోందన్నమాట. నోటి మాటలో తియ్యదనాన్ని ఆశించడం ఎంత గొప్ప మాట! అంతేకాదు ఋగ్వేదంలోని "ఆనో భద్రా క్రతవో యంతు విశ్వతః" – "చెడు మిశ్రితం కాని, అడ్డంకి లేని, అడ్డంకుల్ని తొలగించగల మంగళదాయకమైన ఆలోచనలు అన్ని వైపుల నుండి వచ్చి మమ్మల్ని చేరు గాక!" అన్న మాట గురించి, దాని పరమార్థం గురించి తెలిసిందే కదా!

మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత సంపాదించినా, ఎన్ని విజయాలు సాధించినా అతని బుద్ధికీ, ఊహకూ, ఆలోచనలకూ అందని మరొక 'శక్తి' ఏదో ఉంది, ఉంటుంది. ఆ శక్తినే భగవంతుడిగా కొలిచాం, కొలుస్తున్నాం. మానవుడు తన స్వశక్తిని నమ్ముతూ, సంకల్పబలంతో, ఆత్మశక్తితో అవరోధాల్ని ఛేదించుకొంటూ అడుగులు ముందుకు వేయాలి. ఆ ప్రయాణంలో తర్కానికీ, ఆలోచనకూ, ఊహకూ, వాస్తవానికీ అందని అంశాలు ఎదురైనప్పుడు మానవుడు "అమ్మో! నా వల్ల కావడం లేదే" అని భయపడి పోవడం సహజం. అలాంటి విపత్కర స్థితిలో అమ్మ చంటి పిల్లాడి చేయి పట్టుకొని తీసుకువెళ్ళినట్లు, మనిషిని నడిపించే శక్తే – భగవంతుడు. అందుకే ఆ యా వేదోపనిషత్తుల్లోని శ్లోకాల్లో, సూక్తాల్లో ఒక వైపు భగవంతుణ్ణి ధ్యానిస్తూనే, మరోవైపు మానవుడిలోని అంతర్గతయుక్తినీ, అనంత శక్తినీ వెలికితీసే, ప్రేరేపించే, ప్రజ్జ్వలింపచేసే తత్త్వం కనిపిస్తుంది. మానవుడి ప్రవర్తనకు సంబంధించిన అంశాలు కూడా ఆ యా శ్లోకాల్లో ఉన్నాయంటే ఆశ్చర్యం వేస్తుంది.

చూడండి! కొన్ని వందల, వేల సంవత్సరాల కిందటి గ్రంథాలైన వేదోపనిషత్‌లలోని సంస్కృత శ్లోకాలలో ఉన్నది – జీవన వికాసమే! మనిషి తన జీవితాన్ని పరమార్థభరితం చేసుకొనేందుకూ, పరిపూర్ణ మానవుడిగా అయ్యేందుకూ అవసరమైన మంత్రాలే ఆ యా సూక్తాలు. మానవుడు, మానవుడిగా ఎలా ప్రవర్తించాలో చెప్పడమే సనాతన భారతీయ గ్రంథాల సారం! ❖

కూలబడిన నరుడు కుదురుట అరుదు...

– ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి



కుండ చిల్లిపడిన గుడ్డదోపగవచ్చు
పనికి వీలుపడును బాగుగాను
కూలబడిన నరుడు కుదురుట యరుదయా!
విశ్వదాభిరామ వినుర వేమ!

భావం : కుండకు రంధ్రం పడినట్లయితే ఓ బట్టను అందులోకి దూర్చి నీళ్ళు కారకుండా ఆపవచ్చు. అప్పుడు ఆ కుండను వాడుకోవచ్చు. కానీ పతనమైన మనిషి మళ్ళీ బాగుపడడం చాలా కష్టమైన విషయం.

వ్యాఖ్య : కుండకు రంధ్రం పడితే చిన్న గుడ్డను దూర్చి కనీసం కొంతకాలమైనా పనికి ఉపయోగించుకోవచ్చు. నాగలి కోల విరిగితే త్రాడు చుట్టవచ్చు; మట్టి పొయ్యి కూలితే అప్పటికప్పుడు రాయిని తెచ్చి పెట్టవచ్చు; గుడిసె కారితే కమ్మ చదురవచ్చు... ఇలా ఎన్ని ఉపాయాలనైనా చేసి బ్రతుకుబాటను సుఖమయం చేసుకోవచ్చు.

కానీ, చెడు అలవాట్లకు బానిస అయిన వ్యక్తి మరల కుదురుకోవడం చాలా అరుదు అంటాడు యోగి వేమన. అయితే పతనమైన వ్యక్తి మరలా మంచి వ్యక్తిగా మారడం అసంభవం అని వేమన అనలేదు. కానీ అలా మంచి నడతను మరలా అలవరచుకోవడం ఎంతో పట్టుదలతో ప్రయత్నిస్తేగానీ సాధ్యం కాదని ఆయన ఉద్దేశ్యం.

మనిషి అనారోగ్యం నుంచి కోలుకొని యథావిధిగా పనిచేయవచ్చు. కానీ వేమన శారీరక రుగ్మతల గురించి కాక, మానసిక రుగ్మతల గురించి చెబుతున్నాడని భావించాలి. అంతరంగంలో అపరాధాలను చేసి, చేయలేదన్నట్లు వ్యవహరించే వాడు నిజంగా మిథ్యాచారి. అలాంటి వ్యక్తి మానసిక రోగమున్నవాడు. కాబట్టి మనస్సును ఎల్లప్పుడూ సన్మార్గంలో పయనించేలా జాగ్రత్త వహించాలి. ❖

ఎక్కువ మాట్లాడేవారికి సాధారణంగా తక్కువ సంగతులు తెలిసి ఉంటాయి.
ఎక్కువ తెలిసిన వారు ఎప్పుడూ తక్కువ మాట్లాడతారు. - రూసో

యువవాణి

- స్వామి పరిజ్ఞేయానంద

పి. లక్ష్మారెడ్డి, హనుమకొండ.

ప్రశ్న : నేను స్వామి వివేకానంద సాహిత్యాన్ని చదివాను. ఇప్పుడు నేను సమాజ పరివర్తన కోసం నా వంతు కృషి చేస్తున్నాను. కానీ నాదొక సందేహం... భగవంతుణ్ణి స్వీయ మోక్షం కోసం ప్రార్థించాలా? లేదా పునర్జన్మను ప్రసాదించమని ప్రార్థించాలా? ఈ రెండింటిలో ఏది శ్రేష్ఠమైనదో తెలియజేయండి.

జవాబు : మనకు ఏది శ్రేయస్కరమో నిర్ణయించుకోలేని సందిగ్ధావస్థలో ఉన్నప్పుడు 'భగవంతుడా! నాకు ఏది శ్రేయస్కరమో దానినే ప్రసాదించు తండ్రీ' అని ప్రార్థించడం ఉత్తమం.

ఇకపోతే, మీరు స్వామి వివేకానంద బోధనల్ని ఆకళింపు చేసుకొని సమాజ వికాసానికి కృషి చేస్తున్నారు కాబట్టి మీ సందేహానికి సమాధానం స్వామీజీ మాటల్లోనే...

1. "ఎవరైతే తమ సర్వస్వాన్నీ పరుల కోసం త్యాగం చేస్తారో అలాంటివారి కోసం మోక్షమే వచ్చి తలుపు తడుతుంది. అలా కాకుండా నిరంతరం 'నా ముక్తి, నా ముక్తి' అని వెంపర్లాడే వారికి ఎన్నటికీ శ్రేయస్సు లభించదు".

2. "ఇతరులకంటే ముందు 'నాకు ముక్తి కావాలి' అని భావించేవాడు స్వార్థపరుడు. 'అందరికీ ముక్తి లభించిన తరువాతే నాకు ముక్తి. స్వర్గ సుఖాలు కూడా నాకు వద్దు. ఇతరులకు సహాయం చేయడానికి అవసరమైతే నరకానికి వెళ్ళడానికైనా నేను వెనుకాడను' అని అంటాడు నిస్వార్థపరుడు".

3. "నా దేశంలో ఒక్క వీధి కుక్క సైతం ఆకలితో ఉన్నంత వరకూ దాని క్షుద్బాధ తీర్చడమే నా పరమ ధర్మం. సజీవ శివుణ్ణి ఆరాధించడానికి ఎన్ని జన్మలు ఎత్తడానికైనా నేను సిద్ధమే!".

మహాభక్తుడు ఏకనాథ్ గంగోత్రి నుంచి కావడిలో గంగా జలాన్ని మోసుకొంటూ రామేశ్వరంలోని శివుణ్ణి అర్చించడానికి కాలినడకన బయలుదేరాడు. అలా యాత్ర కొనసాగుతుండగా దారిలో ఒక గాడిద వడదెబ్బకు స్పృహతప్పి పడివుంది. మరణావస్థలో ఉన్న ఆ గాడిదను చూసిన ఏకనాథుడు 'ముందు ఈ సజీవ శివుణ్ణి గంగాజలంతో అర్చించడం ముఖ్యం' అని తలచి కుండలోని గంగాజలాన్ని గాడిద నోట్లో పోశాడు. వెంటనే స్పృహతప్పి పడివున్న గాడిద తేరుకుంది.

ఏకనాథుడు శివుణ్ణి ఆరాధించడం వల్ల తనకు రాబోయే పుణ్యం, ముక్తి, మోక్షాల గురించి ఏమాత్రమూ ఆలోచించకుండా తన కళ్ళ ముందు ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక మూగ జీవిని సాక్షాత్తూ ఆ రామేశ్వరుని అర్చనతో సమానంగా భావించి సేవించాడు.

He who has more of this unselfishness is more spiritual and nearer to Shiva than anybody else.

- Swami Vivekananda

'ఎవరిలోనైతే నిస్వార్థ భావం ఉంటుందో వారే గొప్ప ఆధ్యాత్మిక సంపన్నులు. అలాంటి వారే భగవంతునికి అత్యంత సన్నిహితులు' అని అంటారు స్వామి వివేకానంద.

నిజానికి ప్రపంచం, భగవంతుడు వేరుకాదు. ప్రపంచమంతటా నిండి వున్నది ఆ భగవంతుని చైతన్యమే! కాబట్టి సాటి జీవిలో శివుణ్ణి దర్శించి సేవిస్తే ఆ మోక్షమే మనల్ని వెతుక్కుంటూ వస్తుంది.

To be unselfish is salvation itself... 'స్వార్థరాహిత్యమే మోక్షం'. ఇదే స్వామీజీ ప్రపంచానికి అందించిన అనుష్ఠాన వేదాంతం. దీన్ని ఆచరణాత్మకం చేస్తే మనం నిత్య ముక్తులమే! ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :

యువవాణి

శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029

ఉన్నత స్థితికి ఉత్తమ మార్గం

– స్వామి సేవ్యానంద

మనం జీవితంలో ఉన్నతమైన స్థితికి చేరాలంటే 'త్యాగం' ఎంతైనా అవసరం. శ్రీరామకృష్ణుల జీవితం ద్వారా మనం నేర్చుకోవలసిన ప్రధానమైన విషయం – 'త్యాగం'. త్యాగం అంటే ఏమిటి? మనం బాధ్యతలన్నీ వదిలిపెట్టి, ఒళ్ళంతా విభూతి పూసుకొని దేశం నలుమూలలా తిరగడమేనా? ఎంత మాత్రమూ కాదు. త్యాగం ద్వారా మనం మరింత బాధ్యత గల పౌరులం అవుతాం.

శాశ్వత ఆనందం సొంతం కావాలంటే? : మనకు కాస్త ఆనందాన్ని ఇవ్వడం కోసం భగవంతుడు ఎన్నో రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశాడు. మొబైల్ ఫోన్, కంప్యూటర్, టీవీ... ఇంకా భార్యా పిల్లలు... ఇలా వస్తువులతో, మనుష్యులతో కాలం గడపడమే జీవితమని భావించి అసలు విషయాన్ని మనం మరచిపోతాం. అయితే వీటిలో ఏ మాత్రం సుఖం ఉందో అనుభవం మీద తెలిశాక, నిజమైన ఆనందం కోసం ప్రయత్నిస్తాం.

మనం ఏం త్యాగం చేయగలం?: "ప్రతి జాతికీ ఆదర్శం – త్యాగం" అని స్వామి వివేకానంద చెబుతారు. మనం ఏం త్యాగం చేయగలం? మనకంటూ సొంతమైనది ఏమైనా ఉంటే కదా మనం త్యాగం చేసే ప్రసక్తి వస్తుంది. మనవి అనుకుంటున్న ఆస్తులు, అంతస్థులు, భార్య, పిల్లలు ఎంత వరకు మన సొంతం? శ్రీరామకృష్ణులు ఒక కథ చెబుతారు:

"ఒక సాధువు శిష్యునికి ఉపదేశం చేస్తూ, 'ఈ సంసారంలో మనకంటూ సొంతమైనవారు ఎవరూ లేరు. అందుకే భగవంతుని నామాన్ని స్మరించి, ఆధ్యాత్మిక జీవితంలో ముందుకు వెళ్ళే ప్రయత్నం చెయ్యి' అన్నారు. సమాధానంగా శిష్యుడు 'నా భార్య, పిల్లలు, నా వారంతా నన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తారు. నా గురించి ఏమైనా చేస్తారు' అన్నాడు. 'సరే! ఒక పరీక్ష చేస్తాను. నీకు ఒక మందు ఇస్తాను. నీవు అది తీసుకున్న వెంటనే మరణించిన వాడిలా పడి ఉంటావు. అయితే బయట జరిగేదంతా వినగలవు. తరువాత ఏం జరగాలో నేను చూసుకుంటాను' అన్నారు సాధువు.

సాధువు చెప్పినట్లే శిష్యుడు మందు తీసుకోవడం జరిగింది. అతనిలో జీవం ఉన్న లక్షణాలేవీ లేవు. అతని భార్య, పిల్లలు గట్టిగా ఏడుపులు, గోల ఆరంభించారు. ఇలా కొంత సమయం గడిచాక సాధువు అటు వైపుగా వెళ్ళి విషయం అడిగారు. అంతా విని సాధువు 'మీరు బాధపడకండి. ఇతణ్ణి బ్రతికించే ఔషధం నా దగ్గర ఉంది. అయితే ఒక షరతు. నేను ఇచ్చే మందును ముందుగా మీలో ఒకరు వేసుకోవాలి. ఆ మందును వేసుకున్న వారి ప్రాణం పోయి, ఇతను బ్రతుకుతాడు. ఇప్పుడు చెప్పండి. ఇతని గురించి ప్రాణత్యాగం చెయ్యడానికి మీలో ఎవరు సిద్ధంగా ఉన్నారు?' అని అడిగాడు.

అందరూ ఏడుపులు ఆపి, ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. గురువు ముందుగా శిష్యుని తల్లితో, 'ఏమమ్మా! నువ్వు ఇతనికి కన్నతల్లివి కదా! ఎటూ వృద్ధాప్యంలో ఉన్నావు. మందు తీసుకుంటావా?' అని అడిగారు.

వెంటనే ఆమె 'లేదు, లేదు. నేను చనిపోతే నా మనుమళ్ళను ఎవరు చూసుకుంటారు? వారి పెళ్ళి, పేరంటాలు నేనే చూడాలి' అంది. సాధువు ఇప్పుడు భార్యనూ, తరువాత పిల్లలనూ అడిగారు. మందు వేసుకోవడానికి ఎవరూ అంగీకరించలేదు.

అంతా వింటున్న శిష్యుడు ఒక్కసారిగా లేచి, 'మీకు నాపై ఏ మాత్రం ప్రేమ ఉందో అంతా అర్థమైంది. ఇక మీకూ, నాకూ ఎలాంటి సంబంధమూ లేదు' అని చెప్పి, సాధువుతో పాటు బయలు దేరాడు."

ఈ సంసారంలో మనకంటూ సొంతమైనది ఏమీ లేనప్పుడు మనం ఏం త్యాగం చేయగలం? 'నేను', 'నా' అన్న స్వార్థ స్వభావాన్ని 'త్యాగం' చేసి, అందరిలో విరాజిల్లుతున్న భగవంతునికి 'సేవ' చేయడమే మన కర్తవ్యం. మనలోని మమకార అహంకారాలు, రాగ ద్వేషాలు – ఇలా మనస్సును కలుషితం చేసే అన్నిటినీ త్యాగం చేసి, మనస్సును పవిత్రం చేయడమే నిజమైన సాధన! నిరంతరం 'సేవ' అనే యజ్ఞాన్ని చేసినప్పుడే మనలో ఉన్న 'అహంకారం' అనే అడ్డుగోడ తొలగిపోతుంది. మనం 'శాశ్వత ఆనందాన్ని' అనుభవించ గలం. అందుకే, మనమంతా 'త్యాగం' అనే ఉత్తమ మార్గాన్ని అనుసరించి, ఉన్నతమైన స్థితికి చేరుకోవడానికి ప్రయత్నిద్దాం. ❖

ధనవంతుడు కావడం, కాకపోవడం మన చేతుల్లో లేకపోవచ్చు.
కానీ నీతిమంతులుగా ఉండడం, ఉండకపోవడం అన్నది మన చేతుల్లోనే ఉంది. - ఎమర్సన్

కుటుంబమే కరదీపిక

– బి. సైదులు

జీవితంలో విజయానికి బీజాలు పడేది పచ్చని కుటుంబ ప్రాంగణంలోనే. నిజానికి ఇల్లంటే నీడనిచ్చే నాలుగు గదుల కూటమి కాదు; ఆర్భాటాలు, ఆడంబరాలతో నిండిన కలిమి కాదు. ఇల్లంటే మమతానుబంధాలు, మానవీయ విలువలు మల్లెతీగల్లా అల్లుకునే పూలతోట.

కాని దురదృష్టవశాత్తూ 'ఆధునిక గృహం'లో ఆత్మీయత లోపించింది; ప్రశాంతత కరువయింది. మొక్కుబడి పలకరింపులు, ముక్కలయిన అనుబంధాలు 'ఇంటిని' బీటలు వారుస్తున్నాయి. మార్గదర్శకత్వం వహించలేని పూర్వతరాలు, అలజడి నిండిన ఆధునిక తరాలు కుటుంబాల్ని కలతలకు కూడలిగా మారుస్తున్నాయి; ఆ కలహాల, కలతల ఫలితం సమాజంపై కలుషిత ప్రభావాన్ని చూపుతోంది. ఈనాటి ఎన్నో దాష్టీకాలకు, దౌర్జన్యాలకు చాలా వరకు కుటుంబమే కారణం అంటే అతిశయోక్తి కాదు. అందుకే సమాజం మారాలంటే ముందు ఇంటివాతావరణం మారాలి; అదే విధంగా ఇల్లు మారాలంటే ముందు ఇంటియజమాని మారాలి, ఇల్లాలు మారాలి.

గృహమే గుడి....

A happy family is but an earlier heaven....

అంటారు ఆంగ్లమేధావి జాన్ బౌరింగ్. వ్యక్తిత్వ నిర్మాణంపై, వ్యక్తి వ్యవహారశైలిపై ఇంటి ప్రభావం గణనీయంగా ఉంటుంది. చరిత్రలో విజయవంతమైన ప్రతి ఒక్కరి కుటుంబ నేపథ్యం ఎంతో ప్రశస్తమైంది. ఆర్థికంగా ఒడుదొడుకులూ, కష్టనష్టాలూ పిల్లల్ని అంత ప్రభావితం చేయవు; కానీ తల్లితండ్రుల కుటుంబ నిర్వహణా శైలి, వారి ప్రవర్తన, సుఖ దుఃఖాలకు స్పందించే తీరు బిడ్డల మనస్సుపై బలంగా ముద్రపడతాయి. గృహంలో సర్వసుఖాలు కల్పించి, తల్లితండ్రులు మాత్రం కీచులాడుకుంటుంటే ఆ ఇల్లు నరకాన్నే తలపిస్తుంది; సౌకర్యాలు, సౌలభ్యాలు పరిమితంగా ఉన్నా, అయినవారంతా ఆరోగ్యకరమైన అనుబంధాలతో మసలుకుంటే ఆ ఇల్లు స్వర్గాన్ని మరిపిస్తుంది. ఆలయానికి ప్రతిరూపమవుతుంది.

విలువల కొలువు...

మగపిల్లలు తండ్రి సంస్కారాలను, ఆడపిల్లలు తల్లి సంస్కారాలను వారసత్వంగా పొందుతారంటోంది రామాయణం. కాని నేటితరం దంపతులు ఈ పసిడి పలుకుల్ని పెడచెవిన పెడుతున్నారు. తమను, తమ ప్రవర్తనను, జీవనశైలిని, సంస్కారాల్ని పిల్లలు గమనిస్తున్నారన్న విషయాన్నే విస్మరిస్తున్నారు. వారి ముందే అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. నేటి యువతీయువకుల విపరీత ప్రవర్తనకు, విశృంఖల భావనలకు పరోక్షంగా కారణం కన్నవారే! ఏ బాహ్యపరిస్థితులు, పరిసరాలు, మిత్రపరివారం ప్రభావితం చేయలేనంత పటిష్ఠంగా తల్లితండ్రులు బిడ్డల వ్యక్తిత్వాన్ని తీర్చదిద్దలేకపోతున్నారు. పదహారేళ్ళు మనం పెంచి పోషించి, మన కనుసన్నల్లో ఎదిగిన కొడుకును ఒక సినిమానో, ఒక స్నేహితుడో మార్చివేశాడంటే మన పెంపకంలో ఎక్కడో లోపం ఉందన్నమాటే! ఓ చిన్న గాలి వాటానికే మొక్క మూలాలు కదిలిపోయాయంటే పాదువేయడంలో పొరపాటు జరిగినట్లే కదా! అందుకే ఎప్పుడు కారుణ్యం చూపాలో, ఎప్పుడు కఠినంగా వ్యవహరించాలో కన్నవారికి తెలియాలి.

ఇంటి నుంచే గెలుపు...

No success in public life can compensate for failure in the home అంటాడు బెంజమిన్ డిస్రేలి. ఎంత రచ్చ గెలిచినా, ఇంట గెలవకపోతే అది జీవితానికి చెరగని మచ్చే. ఈ రోజు చాలా మంది సమాజపరంగా ఎనలేని విజయాలు సాధిస్తున్నారు; అధికారులుగా వందలాది మందిని శాసించి, నియంత్రించగలుగుతున్నారు. కానీ ఇంట్లో పిల్లల్ని ఉత్తమపౌరులుగా తీర్చదిద్దలేకపోతున్నారు. ఫీజు కోసమో, పిక్నిక్ డబ్బుల కోసమో తప్ప తండ్రిని పలకరించేంత

చనువు లేని కొడుకు, ఆ తండ్రి ముందు తన మనస్సును ఎలా ఆవిష్కరించగలడు? ఆ తండ్రి నుంచి ఏం నేర్చుకోగలడు?. చాలా మంది తల్లితండ్రులు తమ పిల్లలు తమను చూసి భయపడాలనుకుంటున్నారు; నిజానికి వారికి తల్లితండ్రుల పట్ల ఉండాల్సింది భయం కాదు గౌరవం. క్రమశిక్షణను కూడా పిల్లలకు ప్రేమతో, ఓర్పుతో నేర్పాలే కానీ, భయభ్రాంతులతో కాదు. ఇంటికి ఆలస్యంగా వెళితే అమ్మానాన్న కోపగించుకుంటారని భయపడడానికీ, నేను వెళ్ళే వరకూ అమ్మానాన్న అన్నం తినరని ఆందోళన పడడానికీ చాలా భేదం ఉంటుంది; ఇంటికి ఆలస్యంగా వస్తే తిట్టడం భయంతో కూడిన క్రమశిక్షణ; అన్నం తినకుండా ఎదురుచూడడం ప్రేమతో కూడిన నియంత్రణ. ఇలాంటి పాఠాలే ముందు మనం నేర్చుకోవలసింది. అందుకే ఈ రోజుల్లో బిడ్డల తప్పటడుగుల్ని కన్నవారి కన్నా, బయటివారే ముందు పసిగట్టగలుగుతున్నారు. అంటే చాలా కుటుంబాల్లో సభ్యుల మధ్య మాటలే తప్ప మమతల సవ్వడులు వినిపించడం లేదు. ఇకనైనా తల్లితండ్రులు ఆస్తిపాస్తులు పోగేయడం కన్నా ఆత్మీయతలు అల్లుకునేలా జాగ్రత్త పడాలి.

ప్రథమ పాఠశాల....

'ఈనాటి పిల్లలకు ఇంట్లో అడగకుండానే అన్నీ లభిస్తున్నాయి; ఇంత సులభంగా మాకేదీ దొరికేది కాదు. ఎంత చిన్న వస్తువయినా సరే, మాకు దుర్లభంగానే ఉండేది. అందుకే ప్రతి చిన్న సౌకర్యాన్ని కూడా సంపూర్ణంగా అనుభవించి ఆనందించగలిగాం; అలా సౌందర్య సారం సరళత్వమనీ, వ్యక్తిగతమైన నిజాయతీ సౌశీల్యానికి మూలమనీ తల్లితండ్రుల నుంచి మేము నేర్చుకున్నాం' అంటారు రవీంద్రనాథ్ టాగూరు. కానీ నేడు చాలా కుటుంబాల్లో ఇలాంటి వాతావరణమే కనిపించడం లేదు. ఆనందం నిజానికి ఎక్కడి నుంచి లభిస్తుందో తల్లితండ్రులకే తెలియడం లేదు. వ్యవహారాల్లో, వ్యసనాల్లో తండ్రి; సీరియళ్ళు, షాపింగుల్లో తల్లి ఆనందాల్ని వెతుక్కుంటుంటే పిల్లలు తమ ఆనందాల కోసం సినిమాలనో, స్నేహితులనో ఆశ్రయించక ఏం చేస్తారు? నేటి తరానికి కన్నవారు ఏం చేయగూడదో చెబుతున్నారు, మరి ఏం చేయాలో చెప్పడం లేదు. ఆరోగ్యకరమైన అభిరుచులను పరిచయం చేయడం లేదు. మానసికంగా కలుషితం చేసే వాతావరణానికి దూరంగా సంగీతం, సాహిత్యం తదితర అభిరుచులతో కూడిన పరిసరాలకు వారిని పరిచయం చేయాలి. వాటిలో అపరిమితమైన ఆనందం ఉంటుందని తల్లితండ్రులు స్వయంగా అనుభవిస్తూ చూపాలి.

మానవ సంబంధాలకు మూలం...

The quality of your life is the quality of your relationships.... అంటాడు ఆంథోని రాబ్లిన్. మానవసంబంధాలపైనే మన జీవనసరళి ఆధారపడి ఉంటుంది. అలా సమాజంలో వ్యక్తి నెరపే మానవ సంబంధాలకు ఇల్లే సరైన శిక్షణాలయం. త్యాగం, సహనం, బాధ్యతల నిర్వహణ తదితర అంశాలన్నీ పిల్లలు ఇంటి నుంచే నేర్చుకుంటారు. ఈ రోజు చాలా మంది యువతీయువకులు విద్యాపరంగా అత్యున్నత స్థాయిలో ఉన్నా వృత్తిపరంగా, బాధ్యతల పరంగా, మానవ సంబంధాల విషయంలో ఘోరంగా విఫలమవుతున్నారు. దీనికి కారణం ఇంట్లో వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తల్లితండ్రులు తీర్చిదిద్ద లేకపోవడమే. ఇంటి వాతావరణ ప్రభావంతో నేటి యువతీ యువకులు తాము హక్కులకు వారసులుగానే భావిస్తున్నారు; బాధ్యతల విషయానికి వచ్చేసరికి భుజాలు తప్పిస్తున్నారు. తల్లితండ్రులు ఈ సున్నితమైన అంశాన్ని గుర్తించాలి. ఈ ప్రపంచానికి తమ కుటుంబం ఇచ్చే అత్యంత విలువైన ప్రాతినిధ్యం బాధ్యతాయుతమైన తమ బిడ్డలేనని తల్లితండ్రులు గ్రహించాలి. అప్పుడే అజేయులైన వారి తల్లితండ్రులకూ, ఆ కుటుంబానికీ సమాజం ఋణపడి ఉంటుంది. ❖

మా ఇంట్లోనే నా తొలిపాఠాలు...

భారతరత్న అబ్దుల్ కలామ్

నేను అలవరచుకున్న విలువలకు మూల కారణం మా అమ్మానాన్నలే. మా ఇంట్లో నేను పెరిగి పెద్దవాడినవుతున్నప్పటి నుంచీ పూర్తిగా వారి ప్రభావమే నాపైన పడింది. వారేమంత కలిగిన వారు కాకపోయినా, తమ చుట్టూ ఉన్నవారిని అవసరానికి ఆదుకోవడం కూడా చూశాను. ఆర్థిక ఇబ్బందుల్ని పక్కన పెట్టి నన్ను పాఠశాలకు పంపించాల్సిందిగా మా నాన్నను ఒప్పించింది మా ఉపాధ్యాయుడు శివసుబ్రహ్మణ్య అయ్యర్. తమ పిల్లల్ని మంచి మనుష్యులుగా రూపొందించడానికీ, వాళ్ళు శ్రమజీవులుగా, చైతన్యవంతులుగా రూపుదిద్దుకోవడానికి తల్లితండ్రులు తమ వంతు కృషి చేయడానికి ఎప్పుడూ సంసిద్ధులుగా ఉండాలి. ❖

మనిషికి విదేశాలలో విద్యా బుద్ధులే మిత్రులు, ఇంట్లో భార్య నేస్తం, రోగాలు బాధించే దశలో ఔషధాలే మిత్రులు, మరణించిన అనంతరం ధర్మమే మిత్రుడు - చాణుక్యుడు



సంతోషంగా జీవించడం ఎలా ?

– స్వామి రఘునాయకానంద

ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలనే కోరుకుంటారు. అయితే సంతోషంగా ఉన్నామనే దానికి కొలమానం ఏమిటి? 'యువత సంతోషంగా ఉండాలంటే కావల్సింది ఏమిటి?' అని ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్ వంటి నగరాల్లో ఒక సర్వే నిర్వహించారు. సంతోషంగా ఉండడానికి కావాల్సినవి 'కీర్తి, సంపదలు, అందం, ఆరోగ్యం' అని చాలా మంది ఆ సర్వేలో వెల్లడించారు.

ఒకరు భోగ భాగ్యాలతో జీవిస్తున్నప్పటికీ అతనికి ఉన్న ఐశ్వర్యం సంతృప్తిని ఇవ్వకపోతే సంతోషం లేనట్లే కదా? మరొక వ్యక్తి తనకున్న సంపదతో సంతృప్తిగా జీవించగలిగితే అతడు సంతోషంగా ఉన్నట్లే!

సంతోషానికి అర్థం సంతృప్తిగా జీవించడం. సంతోషం, సంతృప్తి మనస్సుకు సంబంధించినవి. సాధారణంగా మనం కోరుకున్నది మనకు లభించినప్పుడు సంతోషం కలుగుతుంది. అలాంటి ఆనందం మరొక కోరికకు దారితీస్తుంది. ఆ సంతోషం స్వల్పకాలం మాత్రమే.

మనలో కోరికలు ఉన్నంత వరకూ నిజమైన ఆనందం పొందలేమంటూ శ్రీరామకృష్ణులు భాగవతంలోని ఒక కథను చెప్పారు : "ఒక రోజు కొంతమంది బెస్తలు చేపలు పడుతున్నారు. ఆ సమయంలో ఆకాశంలో ఎగురుతున్న ఒక గ్రద్ద రివ్వున క్రిందికి వచ్చి ఒక చేపను తన్నుకుపోయింది. గ్రద్ద నోటిలో చేప కనపడేసరికి, కాకులు గుంపులు గుంపులుగా దాని వెంటపడ్డాయి. ఆ గందరగోళంలో గ్రద్ద నోటిలో నుంచి చేప జారి క్రింద పడిపోయింది. తక్షణమే కాకులన్నీ గ్రద్దను వెంబడించడం మానేశాయి. అప్పుడు ఆ గ్రద్ద ఓ చెట్టుకొమ్మ మీద వాలి ప్రశాంతంగా కూర్చుని 'ఛీ! నికృష్టమైన ఆ చేప ఈ అనర్థాలన్నిటికీ మూలం! దాన్ని వదిలేసరికి నాకు మనశ్శాంతి లభించింది" అని అనుకుంది.

మనలో ప్రాపంచిక కోరికలు ఉన్నంత వరకూ అశాంతి మనల్ని వెంటాడుతూనే ఉంటుందని దీన్ని బట్టి మనకు అర్థమవుతుంది.

స్వామి వివేకానంద తమ జ్ఞానయోగం పుస్తకంలో ఇలా వ్రాస్తారు: "మరణం అనేది ఉన్నంత వరకు సంతోషం కోసం పరుగులు, ప్రయాస జలగల్లాగ పట్టుకొని వేలాడతాయి. ఇవన్నీ కొంత కాలానికి అనిత్యాలుగా తోస్తాయి. జీవితమంతా ఎంతో బుద్ధిపాటవంతో, తదేక దీక్షతో, పరిశ్రమించి నిర్మించుకొన్న ఆశాసౌధాలు ఒక్క నిమిషంలో కుప్పకూలిపోతాయి." సంతోషం బయటదొరికేది కాదు అని అర్థం అవుతుంది. కోరికల నుండి దూరమైనప్పుడే మనస్సు ప్రశాంతతను సంతరించుకొంటుంది. Happiness comes from being and not having - సంతోషం అనేది మనలో ఉన్నదే కానీ బాహ్య వస్తువుల నుంచి వచ్చేదికాదు.

కోరికలు లేకుండా ఉండడం అసాధ్యం కాబట్టి, జీవించడానికి అవసరమైనవాటిని, ఆత్మనిగ్రహానికి ఆటంకం లేనివాటిని మాత్రమే కోరుకోవాలి. ప్రకృతి ద్వారా వచ్చే ప్రతిబంధకాల నుండి అనాసక్తులమై ఉండగలగాలి. మనలో ఉన్న సంతోషాన్ని, బాహ్యవస్తువుల ద్వారా వచ్చే సంతోషంతో అనుసంధానం చేయాలి. దానికై ధ్యానం క్రమం తప్పక చేయాలి.

ఒక సాధువుగారు తన శిష్యుడితో సాయంకాలం ఊరి పొలిమేరలకు వెళ్ళారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు పచ్చగా కళకళలాడుతూ కనిపించాయి. ఎదురుగా పొలంలో వాడిపోయిన మొక్కలు కనిపించాయి. శిష్యుడు వెంటనే ఆ విధంగా ఉండడం చూసి గురువుగారిని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా సాధువు "నాయనా! ఈ చెట్ల వేర్లు భూమిలో నీటి మట్టం వరకు పోయాయి. కనుక ఈ చెట్లు కళకళలాడుతూ కనిపిస్తున్నాయి. ఈ చిన్న మొక్కల వేర్లు పైపైనే ఉన్నాయి. అవి నీటి మట్టాన్ని తాకలేవు కాబట్టి వాడిపోయాయి" అని సమాధానం ఇచ్చాడు.

ఎవరైతే తమ మనస్సును అంతరాత్మతో అనుసంధానం చేస్తారో వారు ఎప్పుడూ సంతోషంగా ఉండగలరు. ఎవరి మనస్సు అయితే నిత్యసత్యమైన ఆత్మను మరచి అనిత్యాలైన బాహ్యవస్తువుల వెంట పరుగులు తీస్తుందో అలాంటివారు ఎన్నటికీ ఆనందంగా జీవించలేరు. కాబట్టి మనస్సును బాహ్య విషయాలపైకి పోనివ్వకుండా మనలో ఉన్న దివ్యత్వంతో అనుసంధానం చేసుకొని సంతోషంగా జీవించడానికి ప్రయత్నిద్దాం! ❖

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

మద్రాసు
9-9-1952

ప్రియమైన సుధీన్!*

నీవు నీ ఉత్తరంలో అడిగిన కొన్ని అంశాలను గూర్చి నా అభిప్రాయాన్ని తెలియజేస్తున్నాను.

1) భగవద్గీతలోని ఈ శ్లోకాన్ని చదువు. "యత్కరోషి యదశ్నాసి..." (నీవు ఏది చేస్తున్నా, ఏమి తింటున్నా... వాటన్నిటినీ నాకు అర్పణ చెయ్యి. - భగవద్గీత 9-27.) 'నేను నా విధులనూ, కర్తవ్యాలనూ, ఆలోచనలనూ, నా రక్షణనూ సర్వం భగవంతుని పాదాల చెంత సమర్పణ చేశాను. నేను ఆయన చేతిలో కీలుబొమ్మను. ఆయన నన్ను ఏ స్థితిలో ఉంచినా నాకు ఆమోదమే. అందులోనే నాకు ఆనందం ఉంది. సంతోషంలోనూ, దుఃఖంలోనూ, విజయంలోనూ, పరాజయంలోనూ, అన్ని పరిస్థితులలోనూ నేను ఆయన్నే జ్ఞప్తిలో ఉంచుకుంటాను'. "నేను నీ వాడను, నేను నీ వాడను" - ఇది మన ప్రాథమిక మంత్రం కావాలి.

2) జీవితమనేది మన పూర్వకర్మల ఫలం అనే ఈ ఒక్క సత్యాన్ని మనిషి అర్థం చేసుకోవడం ఎంతో కష్టం. నువ్వు రోడ్డు మీద నడుస్తున్నావు. అకస్మాత్తుగా నీ కాలికి ఒక రాయి తగులుతుంది. భరించలేనంత నొప్పిగా ఉంది. నువ్వు ఎవరి మీద కోపగిస్తావు? ఒక వ్యక్తి తెలివి తక్కువవాడైనప్పటికీ ఒక ధనికుని ఇంట పుట్టి తన జీవితాన్ని ఆనందంగా గడిపేస్తుంటాడు. మరొకడు చాలా తెలివిగలవాడై ఉండీ, కష్టించి పని చేసే నేర్పు ఉండీ కూడా ఒక కూలివానిగా తన జీవితాన్ని కష్టాల పరంపరలో గడుపుతాడు. అతడు ఎవరిపై కోపించాలి?

కాబట్టి నాయనా సుధీన్! ఈ ప్రపంచం బాధలతో కూడినది. వార్ధక్యాన్నీ, వ్యాధినీ, మరణాన్నీ ఎవరైనా నివారించగలరా? మన మనస్సును రాత్రింబవళ్ళు తొలిచివేసే కామం, క్రోధం, అసూయ, లోభం మొదలైనవాటి తాపానికి ఎవరి పైన కోపగించాలో చెప్పు? నువ్వెంత వెతికి చూచినా ఈ ముల్లోకాల్లోనూ సంతోషంగా ఉన్న జీవి ఒక్కటి కూడా కనిపించదు. మనకు అత్యంత ఆప్తమిత్రుడైనవాడు కూడా ఎంతో బాధపడ్డాక చివరకు గతిస్తున్నాడు. అది మనకెంత బాధ! ఇక మనం ఎవరిపై ఆధారపడాలి.

3) నువ్వు ఈ ప్రపంచంలో ప్రశాంతంగా జీవించాలంటే 'వీడు ఇలా ఉన్నాడు, వాడు అలా ఉన్నాడు' అనే విమర్శ మానుకో. ఉదాహరణకు నీ కొడుక్కి కలరా సోకి మృత్యుముఖంలో ఉన్నాడనుకో! నువ్వొక డాక్టరు కోసం పరుగెడుతున్నావు. రోడ్డుపై ఎవరో నిన్ను అవమాన పరిచారనుకో. అప్పుడేం చేస్తావు? ఆ మనిషి నిన్ను తూలనాడినందుకు భరించవా? డాక్టరు కోసమైన నీ పరుగును ఆపేస్తావా?

ఈ ప్రపంచంలో ఇద్దరే సంతోషంగా ఉండగలరు - భగవద్భావనలో మునిగి పోయినవాడు, ప్రశాంత మనస్సుతో ఎంతటి కష్టాన్నైనా భరించగలిగినవాడు.

సుధీన్! నీ మానసిక స్థితిని నేనర్థం చేసుకోగలను. కానీ నాయనా! శ్రీరామకృష్ణుల దయ లేకుండా మనం ఏ పని చెయ్యడానికైనా అశక్తులమే. రాత్రింబవళ్ళూ ఆయన్నే స్మరించు. ఆయనకై విలపించు. ఆయన్నే జ్ఞప్తిలో ఉంచుకో! నీ కాయన తప్పక మనశ్శాంతిని కలిగిస్తారు. ఆయన ఇచ్ఛ లేకుండా ఒక్క ఆకు కూడా కదలదు, అర్థమైందా? ఆయన నీ హృదయ మందిరంలోనే ఉన్నారు. నీ ఆనందానికీ, మనశ్శాంతికీ ఆయనను ప్రార్థిస్తున్నాను.

ప్రేమాశీస్సులతో...
స్వామి ప్రేమేశానంద

(* సుధీన్ కాలాంతరంలో స్వామి భీమానందగా ప్రసిద్ధులు)

తెలుగుసేత : కె. త్రివిక్రమరావు

ఉత్తముల్ని వివేకం, మధ్యముల్ని అనుభవం, అధముల్ని అవసరం, జంతువుల్ని స్వభావం నడిపిస్తాయి. - సిసిరో

...15వ పేజీ తరువాయి.

శివకేశవుడవు...

శివుడన్నా, కేశవుడన్నా ఒక్కడే! సహస్రనామాలతో అర్చనలు అందుకునే విష్ణువైనా; అష్టకాల ఆరాధ్యనీయుడైన శంకరుడైనా ఒక్కరేనని విస్పష్టం చేస్తున్నాడు అన్నమయ్య. అందుకే ఈ కీర్తనలో ఇలా అంటాడు...

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు..

భగవంతుడి నిజతత్త్వాన్ని అర్థం చేసుకోలేక విష్ణువు గొప్పవాడంటూ కొందరు, శివుడే గొప్పవాడంటూ ఇంకొందరు తీవ్ర వైషమ్యాలకు పూనుకోవడం ఆనాటి నుంచి ఆనవాయితీగా వస్తున్నదే! కానీ అన్నమయ్య, శివకేశవుల్లో భేదాన్ని తను చూడలేదు; మనల్నీ చూడవద్దంటున్నాడు. మరికొందరు ఆ భగవంతుణ్ణి కాలభైరవుడిగా, ఇంకొందరు కరుణార్ద్ర హృదయిని, శక్తిస్వరూపిణి అమ్మవారిగా ఆరాధిస్తారంటూ కింది విధంగా కొనసాగిస్తాడు అన్నమయ్య...

అలరి పొగడుదురు కాపాలికు లాదిభైరవుండనుచు ॥
సరినెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానా విధులను తలపుల
కొలదుల భజింతురు...

ఇలా ఎవరికి ఏ విధంగా దర్శనమిస్తే ఆ తలపులను అనుసరించి వారు ఆ యా రూపాల్లో ఆ భగవంతుణ్ణి భజిస్తారని స్పష్టం చేస్తున్నాడు ఆ భక్తాగ్రేసరుడు.

ఘనబుద్ధులకు ఘనుడవు...

ఆ పరమాత్ముడి ఘనతను అర్థం చేసుకోవడం అల్పులకు అసాధ్యం; ఆధ్యాత్మికంగా ఎంత ఎదిగితే ఆ భగవంతుడు కూడా అంత ఉన్నతంగా మనకు దర్శనమిస్తాడు. ఇదే విషయాన్ని ఇక్కడ ఆ భక్తశిఖామణి హృద్యంగా వివరిస్తున్నాడు...

సిరుల మిమునే యల్పబుద్ధి దలచిన వారికి అల్పంబవుదువు
గరిమల మిము నే ఘనమని దలచిన ఘన బుద్ధులకు ఘనుడవు॥

భగవంతుడంటే కేవలం కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భావించేవారు అల్పబుద్ధులు. సంపద కోసమో, సంసారం కోసమో భగవంతుడిని పూజించడం ఎంత అల్పత్వం! ఆయనను, ఆయన కోసమే మనలో ఎంతమంది ఆరాధిస్తున్నారు? మహారాజు దగ్గరకు వెళ్ళి వంకాయలు అడగడం ఎంత అవివేకమో, ఆ భగవంతుడి దగ్గరకు వెళ్ళి లౌకికమైనవి కోరుకోవడం అంతే అవివేకం అంటారు శ్రీరామకృష్ణ పరమహంస. ఇలా ఆ విధాతను అల్ప విషయాలకే పరిమితం చేస్తే అల్పంగానే కనిపిస్తాడు; కానీ ఆయనను విశ్వాంతరాత్ముడిగా, విరాట్ రూపంగా భావించి ఘనమని పూజిస్తే ఘనంగా దర్శనమిస్తాడని వర్ణిస్తున్నాడు అన్నమయ్య.

నీరు కొలది తామర....

ఆ పరమాత్మ చెంతనుంటే దేనికీ కొరత ఉండదు; ఈ పరమసత్యాన్ని తెలుసుకోలేక మనం వేటి కోసమో వెంపర్లాడుతుంటాం. ఇక్కడ అన్నమాచార్య అదే విషయాన్ని ఎంతో సరళంగా, సుందరంగా వివరిస్తున్నాడు. సంపూర్ణ భగవత్ తత్త్వాన్ని **'నీరు కొలది తామర'** అన్న ఒక్క పదంతో మనకు స్పష్టం చేశాడు; కొలనులో నీరు ఎంత ఉంటే తామర అంత ఎత్తులోనే కనిపిస్తుంది. భగవంతుడు కూడా అంతే! అందుకే

నీ వలన కొరతే లేదు మరి నీరు కొలది తామెరవు
ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే ఊరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము చేకొని వున్నదైవమని
ఈ వలనే నీ శరణననెదను ఇదియే పరతత్త్వము నాకు

– అంటాడు ఆ పదకవితా పితామహుడు. నీ వల్ల కొరతే లేదనీ, నీవు నీరు కొద్దీ తామర లాంటి వాడివంటూ వర్ణిస్తున్నాడు; అదే విధంగా ఇక్కడ భగవంతుణ్ణి భాగీరథితో కూడా పోలుస్తున్నాడు. భాగీరథి దరిదాపుల ఏ బావిలో తవ్వినా, భాగీరథీ జలాలే ఊరతాయి. ఆ వేంకటాచలపతి కూడా మనల్ని చేకొని ఉన్నాడని నమ్ముతూ, అతణ్ణే పరతత్త్వంగా శరణు వేడుతున్నానంటాడు అన్నమయ్య.

ఎంతో గంభీరమైన అద్వైత తత్త్వాన్ని అన్నమయ్య అతి సరళంగా స్పష్టం చేశాడు ఈ కీర్తనలో. ఏ రూపంలో నీవు ఆ భగవంతుణ్ణి కొలుస్తున్నావన్నది కాదు ముఖ్యం. ఎంత శ్రద్ధతో, ఆర్తితో ఆరాధిస్తున్నావన్నదే ప్రధానం. సంపూర్ణ విశ్వాసంతో పూజిస్తే భగవంతుడు ఏ రూపంలోనైనా మోక్షాన్ని ప్రసాదిస్తాడు. ❖



అందరి సుఖంలోనే ఆత్మ సుఖం

ఒకసారి సముద్రంలో భయంకరమైన తుపాను వచ్చింది. ఒడ్డుకు సమీపంలో ఒక ఓడ మునిగిపోతోంది. ప్రయాణికులను రక్షించాలంటే తీరం నుండి ఏదైనా నావ వెంటనే అక్కడకు చేరాలి. నావను నడిపే వ్యక్తి కావాలి. అంతటి తుపానులో ప్రాణాలకు ముప్పు ఎవరు కొనితెచ్చుకుంటారు? తీరంలో ఒక బాలుడు నిల్చొని ఉన్నాడు. ఈ స్థితిని గమనించగానే అతనికి దయ కలిగింది. అతను నావను సముద్రంలోకి తీసుకొని వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. అందుకు తల్లి అనుమతి కోరాడు.

పిల్లవాడి మాట విన్న తల్లికి పుత్రవ్యామోహం అడ్డు వచ్చింది. ఆ బాలుని తండ్రి అంతకు ఆరునెలల క్రితం సముద్రయాత్రకై వెళ్ళాడు. అంతవరకూ తిరిగి రాలేదు. అతను చనిపోయి ఉంటాడని అంతా అనుకున్నారు. ఈ బాలుడు మినహా ఆ తల్లికి వేరే ఆధారం ఎవరూ లేరు. బాలుడికి ఏమైనా అయితే తనకున్న ఆ ఒక్క ఆధారమూ పోతుంది. ఈ ఆలోచనలో మునిగి ఉన్న ఆమె దృష్టి ఓడ వైపు మళ్ళింది. అందులో ప్రయాణికులు ఎంతో ఆతురతతో నావ కోసం ఎదురుచూస్తున్నారు. ఓడలోకి నీరు ప్రవేశిస్తోంది. ఆమె ఇలా అనుకుంది: ఈ ఓడ మునిగిపోతే వీరందరి కుటుంబ సభ్యులూ దుఃఖిస్తారు. ఒకవేళ నేనొక్కదాన్ని ఆధారం లేకుండా పోతే ఏదో విధంగా బ్రతుకు వెళ్ళదీస్తాను. ఇలా అనుకొని ఆమె తన కుమారునితో, "నాయనా! వెళ్ళు! భగవంతుడు నిన్ను రక్షిస్తాడు" అని చెప్పి పంపింది.

బాలుడు తమ నావను ఓడ వద్దకు తీసుకొని వెళ్ళాడు. కొద్దిసేపట్లో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అదృష్ట వశాత్తూ, అదే ఓడలో అతని తండ్రి కూడా ఉన్నాడు. బాలుడు, తన తండ్రితో కలిసి తల్లి దగ్గరకు వచ్చాడు. "అమ్మా! చూడు! నావ తీసుకొని వెళ్ళేందుకు నువ్వు అనుమతి ఇచ్చావు. దాని వల్ల నాన్నగారు కూడా సురక్షితంగా బయటపడ్డారు" అని తల్లితో అన్నాడు. భర్త తిరిగి వచ్చినందుకు ఆమె ఎంతో సంతోషించింది. ఇతరుల ప్రాణాలను రక్షించడం కోసం ఆ బాలుడు వెళ్ళాడు. అది అతనికి కూడా సత్ఫలితాన్నిచ్చింది.

ఆ బాలుడు మరెవరో కాదు. తరువాతి కాలంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అబ్రహామ్ లింకన్. ❖

సేకరణ: ఆర్. కృష్ణ

SINDHOORI SURGICALS

(For Plastic Surgery & Stockings)

H.O : Plot No : 272, Singareni Colony, Saidabad, Hyderabad - 500 079
Ph : 040- 24071580, Cell : 9848021180

Shop No : 15, Ground Floor, 6-3-666/B/6, Gokul Towers, Panjagutta, Hyderabad - 82. Ph : 040- 40121180, 23411180, Fax : 23401880

Email : sindhoori@hotmail.com www.sindhoorisurgicals.com

1. ELASTIC STOCKINGS :

Used For Varicose Veins, DVT, Oedema, Lymphoedema & Filariasis, CVI.

CCL.1 - 18-21 mm of Hg
CCL.2 - 23-32 mm of Hg
CCL.3 - 34-46 mm of Hg

a. Graduated Compression.
b. Medical Stockings.
c. Customade Stockings
d. Sigvaris, Medi, Ted.

2. HEALTH FOOT PRODUCTS :

- MCP/MCR. Chappals,
- Sandals
- Shoes
- Silicon heel Cups
- Full Length Silicon Insoles

3. HEALTH CARE PRODUCT :

- LS Belt
- Back Rest
- Knee Cap
- Wrist Support
- Ankle Support
- Derma Colour

మనస్సులో ఒకసారి ఉత్సాహం అణగారిపోతే దానిని మించిన పేదరికం ప్రపంచంలో వేరొకటి లేదు. - హెచ్.డబ్ల్యు ఆర్నాల్డ్

శ్రీ రామకృష్ణ అద్వైత ఆశ్రమ

(హెడ్ క్వార్టర్స్: రామకృష్ణ మఠం & మిషన్, బేలూరు మఠం)

(పి.ఒ) కాలడి, ఎర్నాకుళమ్-683 574, ఫోన్ : 0484 - 2461071; 09447051231

విన్నపం

కాలడిలోని శ్రీరామకృష్ణ అద్వైత ఆశ్రమం 5వ తరగతి నుండి 10వ తరగతి వరకూ చదివే అనాథ, నిరుపేద పిల్లల కోసం 1936 నుండీ ఒక ఉచిత వసతి గృహాన్ని నడుపుతోంది. ఈ వసతి గృహం 100 మంది పిల్లలకు ఉచితంగా భోజన బస వసతులను సమకూరుస్తూ, విద్యావ్యాసంగానికి అవసరమైన పాఠ్య గ్రంథాలను అందిస్తోంది. వీటన్నిటి నిర్వహణ కోసం **రెండు కోట్ల రూపాయల శాశ్వత నిధిని** ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భక్తులనూ, హితైషులనూ ఉదారంగా విరాళాలీయమని కోరుతున్నాం.

శాశ్వత నిధి కోసం వసతి గృహానికి ఇచ్చే ఈ విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని 35 ఎసి ప్రకారం **నూటికి నూరు శాతం పన్ను మినహాయింపు లభిస్తుంది.**

ఆశ్రమంలో నిర్వహించే నిత్యపూజ, ఉచిత వైద్యశాలలు, ఉత్సవ నిర్వహణ లాంటి ఇతర కార్యక్రమాలకై ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 (జి) ప్రకారం పన్ను మినహాయింపు లభిస్తుంది.

విరాళాల్ని Sri Ramakrishna Advaita Ashrama, Kalady పేరున చెక్కు/ డి.డి తీసి Sri Ramakrishna Advaita Ashrama, P.O. Kalady, Ernakulam-683 574 చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కాలడిలోని యూనియన్ బ్యాంక్‌లోని మా **అకౌంట్ నెంబర్ 338602010009164** (IFSC Code : UBIN0533866)కు నేరుగా కూడా పంపవచ్చు.

కృతజ్ఞతాభినందనలతో...

భగవత్సేవలో

స్వామి అమలేశానంద

అధ్యక్షులు

Advt.,

కైలాస-మానస సరోవర తీర్థయాత్ర



భక్తులకు ఓ అపూర్వ అవకాశం

1. కైలాస-మానస సరోవర్ తీర్థయాత్ర : 16 రోజులు ఈ యాత్రను ఖాట్మాండు నుండి ఖాట్మాండు వరకు టయోటా కారులో వెళ్ళి దర్శించి రావటానికి ఏర్పాట్లు చేపడుతున్నాము. కైలాసశిఖర పరిక్రమ, ఇన్నరపరిక్రమ, నందిపరిక్రమ ఏర్పాటు. ఈ యాత్రకు పాస్‌పోర్ట్ అత్యంత అవసరం. సముద్ర మట్టం కంటే 22,000 అడుగుల ఎత్తులో ప్రయాణించవలసి ఉంటుంది. కనుక భక్తులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు ధృవీకరణ పత్రం అవసరం. మే నుండి సెప్టెంబర్ వరకు ఈ యాత్ర నిర్వహించబడును. **2. శ్రీరామకృష్ణ గురుపీఠం కలకత్తా, బేలూరుమఠ యాత్ర 3. చార్‌ధామ్ యాత్ర 4. జమ్మూ, కాశ్మీర్, శ్రీనగర్ అమరనాథ్ యాత్ర 5. కాశీయాత్ర 6. నేపాల్ ముక్తినాథ్ దామోదరకున్ యాత్ర**

పూర్తి వివరాలకు సంప్రతించండి

శ్రీ రామకృష్ణ యాత్ర సర్వీసు

ప్రధాన కార్యాలయం

కొత్త నెం. 120/1, పాత నెం. 216/1 రామకృష్ణ మఠం రోడ్,
ఆర్.కె. మఠం ఎదురు, మైలాపూర్ చెన్నై - 600 004,
ఫోన్ : 044-24616968, సెల్ : 094431 44808, 094440 91428
ఫాక్స్ : 044-2462 0631, Email : srk.yathraservices@gmail.com / gs.anandhan@yahoo.co.in

గాంధీనగర్
విజయవాడ - 3
సెల్ : 94906 35158

ఆధ్యాత్మిక సేవాపరాయణుడు : జి.యస్. ఆనందన్ సెల్ : 094431 44808

లక్ష్యసాధనలో చుక్కాని...

మానవజాతిని స్వామి వివేకానంద ప్రేరేపించినంతగా మరెవ్వరూ ప్రేరేపించలేదు.

నా పేరు జి. నాగేంద్రరావు. మాది కృష్ణా జిల్లా తిరువూరు గ్రామం. నా జీవితంలో రెండు కోణాలు ఉన్నాయి. అందులో మొదటిది స్వామీజీ సాహిత్య పరిచయానికి ముందు, రెండోది స్వామీజీ సాహిత్య పరిచయం తరువాత! స్వామీజీ సాహిత్యంతో పరిచయానికి ముందు నాకంటూ ఒక జీవిత గమ్యం అంటూ ఏమీ లేక సాదాసీదాగా సాగిపోతుండేది. కానీ తరువాత నా కంటూ ఒక లక్ష్యం ఏర్పడింది. దాన్ని సాధించే దిశలో స్వామీజీ ఉపదేశాలు నాకెంతో స్ఫూర్తినిచ్చాయి.

జి. నాగేంద్రరావు

నా చిన్నప్పుడు నోటు పుస్తకాల మీద కాషాయ రంగులో ఉన్న వివేకానందుని చిత్రపటాన్నీ, ఇంకోసారి మా ఇంటి దగ్గరలో ఒక ఆసుపత్రిలో శ్రీరామకృష్ణుల చిత్రపటాన్నీ చూశాను. కొన్నేళ్ళ తరువాత సత్తుపల్లిలో మా బంధువుల ఇంట్లో వారిద్దరి ఛాయాచిత్రాల్నీ చూసి ఆ మహాత్ముల గురించి అడిగి తెలుసుకున్నాను. అప్పటి నుంచీ వారి జీవిత విశేషాలను క్షుణ్ణంగా చదవడం, దగ్గరలోనే ఉన్న రామకృష్ణ సేవా సమితికి వెళ్ళడం ప్రారంభించాను. దాని వల్ల నా ఆలోచనా తీరు పూర్తిగా మారడమే కాక, లక్ష్యం పట్ల స్పష్టత ఏర్పడింది.

ప్రస్తుతం నేను భారతీయ స్టేట్ బ్యాంక్, సారపాక శాఖలో క్యాషియర్‌గా పనిచేస్తున్నాను. నేను లక్ష్యసాధనలో ఉన్నప్పుడు అప్పుడప్పుడు తీవ్రమైన నిరాశా నిస్పృహలు కలిగేవి. ఆ సమయంలో స్వామీజీ ఉపదేశాలు నన్ను ఎంతగానో ఉత్తేజ పరిచాయి.

'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రిక 2008 జనవరి సంచికలో "విజయపథంలో పయనిద్దాం" అనే వ్యాసం నన్ను విశేషంగా ప్రభావితం చేసింది. అందులో...

"మనస్సు మైదానం వంటిది!
నిరాశల ఇసుక చల్లితే ఎడారిగా మారుతుంది!
చిరు ఆశల చినుకు కురిస్తే
గెలుపు గులాబీలా పూస్తుంది" అనే వాక్యాలు నా మీద ప్రభావం చూపాయి.

నిరక్షరాస్యులు, గ్రామీణులు నిత్యం మా బ్యాంకుకు వస్తుంటారు. వారికి అవసరమైన సహాయం చేస్తున్నాను. పనిని ఆరాధనా భావంతో చేసేందుకు స్వామీజీ బోధనలే నాకు స్ఫూర్తి. ❖ (జి. నాగేంద్రరావు, సారపాక, ఖమ్మం జిల్లా)

ధైర్యాన్నిచ్చిన ధీర సన్న్యాసి

నా పేరు ఎస్. పుష్పకుమారి, మాది చిత్తూరు జిల్లా తిరుపతి. నాకు ఇంతకు ముందు ఎప్పుడూ ఏదో ఒక సమస్య వెంటాడుతూ ఉండేది. గత రెండేళ్ళుగా సమస్యలన్నీ తీరిపోయాయి. నేను ఒకసారి తిరుపతిలోని రామకృష్ణ సేవా సమితి గ్రంథాలయానికి వెళ్ళాను. దాదాపు రెండు గంటల పాటు అక్కడే గడిపాను. అక్కడ ఉన్న పుస్తకాలలోని కొన్ని ఆణి ముత్యాల్లాంటి స్వామీజీ బోధనలు నా మనస్సును కదిలించి వేశాయి.

ఎస్. పుష్పకుమారి

1. 'యువతా! మేల్కొండి! మీ శక్తిని తెలుసుకోండి!': ఈ పుస్తకం నాలోని నిస్సహాయతనూ, పిరికితనాన్నీ పోగొట్టింది. ఆ పుస్తకం చదవడం వల్ల నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది.

2. 'సమస్యలు – వాటిని ఎదుర్కోవడం ఎలా?' జీవితంలో ఎన్ని సమస్యలు వచ్చినా, ఎలా పరిష్కరించాలో చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యేలా ఆ పుస్తకంలో వివరించారు. ఈ పుస్తకం నా సమస్యలనూ, ఒత్తిళ్ళనూ పోగొట్టింది. ప్రశాంతంగా ఉండేందుకు సహాయపడింది.

స్వామీజీ బోధనల్ని చదివిన తరువాత నా జీవితంలో ఎంతో మార్పు వచ్చింది. నా జీవితంలో ఎలాంటి సమస్యలు వచ్చినా చాలా తేలికగా పరిష్కరించుకోగల శక్తినీ, ధైర్యాన్నీ నాకు ప్రసాదించిన ధీర సన్న్యాసి – స్వామి వివేకానంద.

ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఒక్క గంటసేపు స్వామీజీ సాహిత్యాన్ని చదివితే ధైర్య స్థైర్యాలు తప్పక వృద్ధి చెందుతాయి. ❖

(ఎస్. పుష్పకుమారి, తిరుపతి)

కష్టంగా ఉన్నా మేలు చేసే మార్గాన్నే స్వీకరించండి.
ఇష్టంగా ఉన్నా చివరికి కష్టాలను కొనితెచ్చే మార్గాన్ని వదిలివేయండి. - స్వామి వివేకానంద

వినడం ఒక కళ!

– ప్రయాగ రామకృష్ణ

ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా వినడమనేది ఎప్పుడో పోయింది. పరుగులు పెట్టే జీవితంలో ఎవరికీ పక్కవాళ్లు చెప్పేది ఎంతటి విషయమైనా సరే ఏకాగ్రతతో వినే తీరిక, ఓపిక – రెండూ లేవు. వాళ్ళ దోవన వాళ్ళు చెప్పుకుపోతుంటే మన దోవన మనం ఏదో ఆలోచిస్తుంటాం. కాలక్షేపం బాతాఖానీలు, కబుర్లూ అయితే మనస్సుపెట్టి వినకపోయినా ఫరవాలేదు కానీ ఇతరత్రా ఏ మంచి విషయమైనా శ్రద్ధగా వినాలి. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అని భగవద్గీతలో కృష్ణుడు అంటాడు.



అధికారంలో ఉన్నవాళ్ళు, కింద వాళ్ళ పట్ల శ్రద్ధ కనబరిచి వాళ్ళు చెప్పేది సహనంతో వింటే ఉత్తమ పాలకులూ, ఉత్తమ అధికారులూ అవుతారు.

నవ విధ భక్తిమార్గాలలో కూడా శ్రవణానికే మొదటి స్థానం కల్పించారు. శ్రవణం సరిగ్గా ఉంటే, మిగిలినవన్నీ తేలిగ్గా సిద్ధిస్తాయి. శ్రవణం అంటే వినడం. ఆ వినడమేదో శ్రద్ధగా వినాలి.

భావప్రసారమంటే వ్రాయడం, మాట్లాడడం, సంభాషించడమే కాదు, వినడం కూడా! ఇతరులు చెప్పింది సరిగ్గా వినక పోవడం వల్ల మనఃస్పర్థలు వస్తాయి.

'శ్రద్ధయా శ్రవణం కుర్యాత్.' శ్రద్ధతో వినాలని శాస్త్రం చెబుతోంది. శ్రవణమే జ్ఞానానికి తొలి మెట్టు. అది లేకుంటే జ్ఞానం ఉదయించదు. విషయాన్ని కూలంకషంగా తెలుసుకోవాలంటే ఓపిగ్గా వినాలి.

ప్రహ్లాదుడి కథ మనందరికీ తెలుసు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే నారాయణ మంత్రాన్ని తల్లి లీలావతికి నారదమహర్షి ఉపదేశిస్తుండగా శ్రద్ధగా విన్నాడు కాబట్టే విష్ణుభక్తుల్లో అగ్రగణ్యుడయ్యాడు.

వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
కని కల్ల నిజము దెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

ఎవరు చెప్పినా వినాలి. వినగానే తొందరపడకుండా ముందు వెనుకలు ఆలోచించి, మంచిచెడ్డలు విచారించి, నిజానిజాలు తెలుసుకొని, తెలివిగా వ్యవహరించాలి. అలాంటి వాడే నిజమైన వివేకవంతుడని సుమతీ శతకకారుడు బద్దెన చెప్పాడు. అందరూ అలవరచుకోవలసిన మంచి గుణమిది.

ఎవరు ఏం చెప్పినా ఉద్రేకాలకూ, ఉద్వేగాలకూ లోను కాకుండా శాంతంగా వినాలి. వాస్తవ దృక్పథంతో వినాలి. ముందే ఏర్పరచుకున్న అభిప్రాయాలతో ఏదీ వినకూడదు. అలాగే చెప్పేది పూర్తిగా వినకుండా ఏ నిర్ణయానికీ రాకూడదు. ఎవరైనా ఏదైనా చెబుతున్నప్పుడు మధ్యలో అడ్డుపడడం మంచిది కాదు. అలా చేయడం వల్ల ఏకాగ్రత దెబ్బతిని ముఖ్యమైన విషయమేదో వినకుండా పోయే ప్రమాదం ఉంటుంది. మనం ఎదుటివారికి ఏదైనా చెబుతున్నప్పుడు వాళ్ళ నుంచి సానుకూల స్పందన కోరుకుంటాం. అలాగే ఎవరైనా! నచ్చితే మెచ్చుకోలు మాట ఏదైనా అనండి. కనీసం తల ఆడించండి. ఓ చిరునవ్వు నవ్వండి. నచ్చకపోతే మాత్రం మెత్తగా, అన్యాపదేశంగా చెప్పండి. కటువుగా చెప్పకండి. దీనిని పాటించడం వల్ల మనకూ చెప్పేవారికీ మధ్య సదవగాహన, సద్భావన పెరుగుతాయి.

అన్నిటికన్నా ముఖ్యం – వినేవాడికి చెప్పేవాడు లోకువ కాదని తెలుసుకోండి. పక్కవాడు చెప్పేది శ్రద్ధగా వింటేనే మనకు గ్రహణశక్తీ, సహనమూ పెరిగేది. ❖

పండుగలు - పర్వదినాలు

మే - 2010

09	ఆదివారం	:	ఏకాదశి
16	ఆదివారం	:	అక్షయ తృతీయ
18	మంగళవారం	:	ఆది శంకరాచార్య జయంతి
24	సోమవారం	:	ఏకాదశి
26	బుధవారం	:	నృసింహ జయంతి
27	గురువారం	:	భగవాన్ బుద్ధ జయంతి

జూన్ - 2010

07	సోమవారం	:	హనుమజ్జయంతి
08	మంగళవారం	:	ఏకాదశి
11	శుక్రవారం	:	ఫలహారిణి కాళీ పూజ
22	మంగళవారం	:	ఏకాదశి



తులసికి పురాణాలిచ్చిన ప్రాధాన్యం

పురాణాలు ఏం చెబుతున్నాయి? :

మన ప్రాచీన ధర్మ గ్రంథాలు, పురాణాలు తులసి గొప్పదనాన్ని వేనోళ్ళ కీర్తించాయి. తులసి మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వల్ల సకల శుభాలూ కలుగుతాయని 'స్కాందపురాణం' చెబుతోంది. తులసీ వనం ఎక్కడ ఉంటే, అది పుణ్యస్థలం లాంటిదని 'పద్మ పురాణం' పేర్కొంటోంది. ఆ ఇంటిలోకి యమభటులు ప్రవేశించలేరని స్పష్టం చేస్తోంది.

తులస్యారోపితా సిక్తా దృష్టా స్పృష్టా చ పాలితా।
ఆరోపితా ప్రయత్నేన చతుర్వర్గ ఫలప్రదా ॥

'తులసి మొక్కను భక్తితో నాటినా, నీటితో తడిపినా, చూసినా, తాకినా, పోషించినా, వనం ఏర్పరచినా – ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ ఫలితాలూ కలుగుతాయి'.

ఒక్క తులసిని పెంచినా అక్కడ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, ఇతర దేవతలు ఆవాసం చేస్తారని అంటారు. అలాగే, అక్కడ గంగాది పుష్కర తీర్థాలన్నిటినీ సేవించిన ఫలితం దక్కుతుంది. తులసీ మాతను ప్రార్థించడం వల్ల దేవతలందరినీ ప్రార్థించినట్లు అవుతుంది. తీర్థయాత్ర చేసిన ఫలం లభిస్తుంది.

తులసీ కాననం యత్ర యత్ర పద్మవనాని చ।
సాలగ్రామ శిలా తత్ర తత్ర సన్నిహితో హరిః ॥

'తులసి వనం ఉన్న చోటా, పద్మాలున్న తావులో, సాలగ్రామం ఉన్న ప్రదేశంలో శ్రీమహావిష్ణువు తప్పనిసరిగా ఉంటాడు'. దీన్నిబట్టి తులసి మొక్కకు ఉన్న ప్రాధాన్యం ఏమిటో గ్రహించవచ్చు.

తులసీ మంజరీభి ర్యః కుర్యాద్ధరి హరార్చనం।
న స గర్భ గృహంయాతి ముక్తి భాగీ భవేన్నరః ॥

'తులసీ దళాలతో విష్ణు భగవానుణ్ణి కానీ, శివుణ్ణి కానీ పూజించినట్లయితే, భక్తులు పునర్జన్మ అనేది లేకుండా మోక్షాన్ని పొందుతారు'.

అలాగే, హరి హర స్వరూపుడైన ఆంజనేయస్వామిని సైతం తులసీ దళాలతో పూజించడం చాలా ముఖ్యం. అలా చేస్తే సర్వాభీష్ట సిద్ధి కలుగుతుందని పురాణాల్లో పేర్కొన్నారు.

తులస్యాశ్చైవ మహత్యం నేష్టి వక్తుం హి విశ్వసృట్।
భవ భంజన మే తత్తే సర్వాభీష్టం ప్రయచ్ఛతి।
నాతః పరతరం కించిత్పావనం భువి విద్యతే ॥

'తులసి సర్వాభీష్టాలనూ తీర్చగల మాహాత్మ్యం గలది. తులసిని మించిన పవిత్రమైన చెట్టు ఈ భూలోకంలో వేరొకటి లేదు. ఈ తులసీ మాహాత్మ్యం గురించి ఆ బ్రహ్మదేవుడు కూడా పూర్తిగా చెప్పలేడు'.

శ్రీతులసీ వ్రతాన్ని భక్తి విశ్వాసాలతో ఆచరించినట్లయితే, అమితమైన పుణ్యం లభిస్తుంది. సర్వశుభాలూ తప్పనిసరిగా కలుగుతాయి. ముఖ్యంగా, కార్తీక శుద్ధ ద్వాదశి (చిలుక ద్వాదశి), క్షీరాబ్ధి ద్వాదశి రోజుల్లో వ్రతాన్ని ఆచరించడం అన్ని విధాలా శ్రేష్ఠం. ప్రతి ద్వాదశి రోజునా తులసీ వన మధ్యంలో విష్ణు సహస్రనామ పఠనం చేస్తే మంచిది. అలా చేసిన వారిలో ఆధ్యాత్మిక భావాలు పెరుగుతాయి. మోక్షమార్గంలో పయనిస్తారు.

కార్తీక మాసంలో తులసీ ప్రార్థనలు చేసినా, కొత్తగా తులసి మొక్కలు నాటినా ఎన్నెన్నో జన్మల సంచిత పాపం నశిస్తుంది. శ్రీకృష్ణునికి తులసీ పత్రాలను సమర్పించడం మోక్ష ప్రదం. తులసి లేని ధార్మిక కర్మలు అసంపూర్తి కింద లెక్క.

యద్ధర్మ కర్మ కురుతే మనుజః పృథివ్యాం।
నారాయణ ప్రియతమాం తులసీం వినా చ
తత్సర్వమేవ విఫలం భవతి ॥

'ఈ భూలోకంలో మానవులు ఎలాంటి ధర్మకార్యంలోనైనా సరే శ్రీమన్నారాయణునికి అత్యంత ప్రియమైన తులసిని ఆరాధించాలి. లేదంటే, ఆ సత్ఫలితాలను పొందలేరు'.

తులసితో సహా దానధర్మాలు చేస్తే, అమోఘమైన లాభాలు కలుగుతాయి. అలాగే, తులసి చెట్టు దగ్గరలో పితృదేవతలకు శ్రాద్ధం నిర్వహిస్తే, అది వారికి అమితంగా తృప్తి కలిగిస్తుంది.

అద్భుత గుణాలున్న తులసీ పత్రాలను రోజుకు మూడుసార్లు ఎవరు భుజిస్తారో, వారు పరిశుద్ధులవుతారు. 'చాంద్రాయణ ఉపవాస' దీక్ష జరిపిన ప్రయోజనం వారికి కలుగుతుంది. తులసి పత్రాలు వేసిన నీటితో స్నానమాచరిస్తే, పవిత్ర గంగా జలంలో స్నానం చేసిన ఫలితం లభిస్తుందని 'పద్మ పురాణం' పేర్కొంటోంది. పూజలోని చరణామృతంలో తులసీ పత్రాలను చేర్చినట్లయితే ముక్తి లభిస్తుంది. వారికి అనారోగ్యం నుంచి, ఆకస్మిక మృతి నుంచి రక్షణ లభిస్తుంది. ❖

(వచ్చే సంచికలో 'తులసి మాలలు')

అబద్ధాలాడటం చేత యజ్ఞఫలితం నశిస్తుంది. గర్వంచేత తపఃఫలితం క్షీణిస్తుంది.
విప్రుల్ని దూషిస్తే ఆయుక్షీణం అవుతుంది. ఇతరులకి వెల్లడి చేస్తే దానఫలితం పోతుంది. - మనుస్మృతి


9
ఆ ప్రాంతంలో ఏరండక మహర్షి తపస్సు కొనసాగిస్తున్నారు. ఆయన వద్దకు వెళ్ళిన రాజు...
మహర్షీ! నా పేరు కాంతమన్. అగస్త్యమహర్షి అనుగ్రహంతో కావేరీ నదీమతల్లిని కుంభకోణంకు తోడ్కొని వచ్చాను. దురదృష్టవశాత్తూ, ఇక్కడున్న మహాబిలంలోకి వెళ్ళి ఆమె అదృశ్యమైంది. మీరే సహాయం చేయాలి!
10
ఏరండక మహర్షి దివ్యదృష్టితో చూసి ఇలా అన్నారు:
రాజా! ప్రజలు చేసే పాపాలు రాజుకు చుట్టుకుంటాయి. అందుకే ఇలా జరిగింది.
అలాగా! అందుకు పరిహారం ఏమైనా ఉందా?
11
పరిహారమా? ఒక నిస్వార్థపరుని ప్రాణత్యాగమే ఈ పాపానికి పరిహారం.
అంతేకదా! ప్రజల ప్రయోజనార్థమే కదా రాజు ప్రాణాలు ఉన్నాయి. నేనే ఈ బిలంలో దూకుతాను, ఆశీర్వదించండి.
రాజా! కావేరీనదిని ఎంతో ప్రయత్నంతో రాజ్య శ్రేయస్సు కోసమే తీసుకుని వెళుతున్నావు. నీ లాంటి రాజు ప్రాణాలు ఎంతో విలువైనవి.
12
మరో ఉపాయం ఏదన్నా ఉందా?
ఆగు రాజా! మా లాంటి వాళ్ళం లోకశ్రేయస్సు కోసం తపం ఆచరిస్తున్నాం. మాకు శరీరమే ఒక భారం. అందువల్ల ఈ సత్కార్యం కోసం నేనే...
అపచారం... మీలాంటి మహాత్ములే రాజ్యానికి రక్ష. మీరే జీవించాలి.



మన సమాజానికి మార్గదర్శకులు ఎన్నడూ సేనానాయకులో, రాజులో కారు. ఋషులే! ఆ విషయం బాగా జ్ఞాపకం ఉంచుకోవాలి.

- స్వామి వివేకానంద

యక్ష ప్రశ్నలు



మహాభారతంలోని అరణ్యపర్వంలో యుధిష్ఠిరుడికీ, యక్షుడికీ మధ్య జరిగిన సంభాషణకు చాలా ప్రాముఖ్యం ఉంది. వాడుకలో ఉన్న 'యక్షప్రశ్నలు' అన్న జాతీయం ఆ కథ నుంచి పుట్టినదే. తన మాట కాదని, సరస్సులోని నీటిని తాగబోయిన భీమార్జున నకుల సహదేవులు నలుగురినీ మరణించేలా చేస్తాడు సరస్సును అధీనంలో ఉంచుకున్న ఓ యక్షుడు. ఆఖరికి ధర్మరాజు వస్తాడు. అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పి, హాయిగా నీళ్ళు తాగమంటాడు యక్షుడు. మహాబలపరాక్రమ సంపన్నులైన తన నలుగురు తమ్ముళ్ళకూ ఆ దుర్గతి కల్పించిన యక్షుడు సామాన్యుడు కాదని యుధిష్ఠిరుడు గ్రహించాడు. తెలిసినంతలో జవాబు చెబుతాను, ప్రశ్నలు అడగమంటాడు. అప్పుడు యక్షుడు వేసిన ప్రశ్నలు, అందుకు ధర్మరాజు ఇచ్చిన సమాధానాలు ఎంతో ఆసక్తికరమైనవి. ధర్మరాజు ఇచ్చిన సమాధానాలతో సంతృప్తి చెందిన యక్షుడు మరణించిన ధర్మజుని నలుగురు తమ్ముల్ని బ్రతికించాడు. ఆ యక్షుడే యమధర్మరాజు.

'యక్షప్రశ్నల' ఘట్టం మహాభారతంలోని అరణ్యపర్వం చివరిలో వస్తుంది. ఆ ఘట్టంలో యక్షుడు అడిగిన చిత్రమైన ప్రశ్నలు, వాటికి ధర్మజుడు ఇచ్చిన జవాబులు చదవండి:

యక్షప్రశ్న: ఆదిత్యుణ్ణి తూర్పున ఉదయించేటట్లు ప్రేరేపించేదెవరు? ఆయనకు సమీపంగా ఉండేదెవరు? సూర్యాస్తమయం కావించేదెవరు? ఆయనకు ఆధారభూతమైనదేది?

ధర్మజుని జవాబు: సూర్యోదయాన్ని నిర్దేశించినవాడు బ్రహ్మ. సూర్యుడి సమీపాన ఉండేది దేవతలు. ధర్మమే సూర్యాస్తమయానికి కారణం. ఆ మహాత్మునికి సత్యమే ఆధారం.

యక్షప్రశ్న: ఏది ఒక మనిషిని శ్రోత్రియుణ్ణి చేస్తుంది? దేనివల్ల అతడు అందరి పొగడ్తలకూ పాత్రుడవుతాడు? ఎలా ఒకడు ద్విజుడవుతాడు? ఓ రాజా! దేని వల్ల మనిషి విజ్ఞుడవుతాడు?

ధర్మజుని జవాబు: శ్రుతి జ్ఞానం వల్ల శ్రోత్రియుడవుతాడు. తపఃశక్తి వల్ల అందరి పొగడ్తలకూ పాత్రుడవుతాడు. జ్ఞానం వల్ల ద్విజుడవుతాడు. పెద్దల సలహా తీసుకునేవాడు బుద్ధిమంతుడవుతాడు.

యక్షప్రశ్న: బ్రాహ్మణునికి ఆపాదించిన దైవత్వమేది? ఏ సుగుణాల వల్ల వారు సాధువులవుతారు? ఏ కార్యాల వల్ల అపవిత్రులవుతారు?

ధర్మజుని జవాబు: వేదాధ్యయనమే బ్రాహ్మణునికి దైవత్వాన్ని ఆపాదింపజేస్తుంది. తపోశక్తి మాత్రమే వారిని పవిత్రులుగా చేసే నిత్య పవిత్ర కర్మ. పరనింద వారి అపవిత్ర నడత. ❖ *(వచ్చే సంచికలో మరికొన్ని...)*

అమృతవాణి

ఉత్సాహో బలవా నార్య! నా స్త్యుత్సాహా త్పరం బలమ్
సోత్సాహ స్యాస్తి లోకేఽ స్మిన్ న కించిదపి దుర్లభమ్ ॥

– వాల్మీకి రామాయణం, కిష్కింధ కాండ, 1వ సర్గ, 121వ శ్లోకం

భావం - "ఉత్సాహం చాలా బలమైనది. ఉత్సాహాన్ని మించిన బలం లేదు. ఉత్సాహవంతుడికి ఈ లోకంలో అలభ్యమైనదంటూ లేదు. అసాధ్యమైనది లేనే లేదు".

సీతాపహరణంతో దిగులు చెందిన అన్న శ్రీరాముణ్ణి ఉద్దేశిస్తూ, తమ్ముడు లక్ష్మణుడు అన్న మాటలివి. దైన్యాన్ని వదిలి ధైర్యాన్ని తెచ్చుకోమంటూ లక్ష్మణుడు చెప్పిన ఈ మాటలు ఎవరికైనా శిరోధార్యమే! ❖

చేనేత కార్మికులకు మగ్గాల పంపిణీ

2009 అక్టోబర్ నెలలో వరదలకు గురైన కర్నూలు జిల్లా, నాగలదిన్నె గ్రామంలోని చేనేత కార్మికులకు **హైదరాబాద్ రామకృష్ణ మఠం** 2010 మార్చి 26వ తేదీన 280 మగ్గాలను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కలెక్టర్ శ్రీ రాంశంకర్ నాయక్; ఎమ్మిగనూరు ఎమ్.ఎల్.ఎ శ్రీ కె. చెన్నకేశవ రెడ్డి పాల్గొని రామకృష్ణ మఠం చేస్తున్న సేవలను కొనియాడారు. హైదరాబాద్ రామకృష్ణ మఠ స్వామీజీలు అనుపమానందజీ, గౌరంగానందజీ, శితికంఠానందజీ మగ్గాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ❖

నివేదిక : బ్రహ్మచారి గౌతమ్

ఆధ్యాత్మిక అంతర్యోగం

అనంతపురం శ్రీరామకృష్ణ సేవా సమితి 2010 మార్చి 7వ తేదీన నిర్వహించిన అంతర్యోగ కార్యక్రమానికి స్వామి కూటస్థానందజీ మహరాజ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పూజ్య స్వామీజీ మాట్లాడుతూ 'ఇతరులను విమర్శించడంలో సమయాన్ని వృథా చేయకుండా పూజ, స్తోత్ర పారాయణ, భగవన్నామ సంకీర్తన, సద్గ్రంథ పఠనాల ద్వారా భగవత్ చింతన చేస్తూ సమయాన్ని సద్వినియోగ పరుచుకోవాలి' అని భక్తులకు సూచించారు. ఇంటర్మీడియట్ విద్యార్థిని కుమారి సింధుజకు సమితి తరఫున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ భావప్రచార పరిషత్ సమన్వయకర్త డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి, ఇతర పుర ప్రముఖులు పాల్గొన్నారు. ❖

నివేదిక : జి. శ్రీధర్‌మూర్తి

సేవా సమితి ప్రారంభోత్సవం

2010 మార్చి 18వ తేదీన **కరీంనగర్‌లో శ్రీరామకృష్ణ సేవా సమితిని** హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామి శితికంఠానందజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్వామి శితికంఠానందజీ, స్వామి రఘునాయకానందజీ శ్రీరామకృష్ణ సందేశ ఆవశ్యకత గురించి వివరించారు. నగరంలోని వివిధ కళాశాలల్లో వ్యక్తిత్వ వికాస సదస్సులను సమితి నిర్వహించింది. ❖

నివేదిక : డాక్టర్ చంద్రశేఖరయ్య

వ్యక్తిత్వ వికాస సదస్సు

మహబూబ్‌నగర్ శ్రీరామకృష్ణ సేవా సమితి 2010 మార్చి 19వ తేదీన విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామి శితికంఠానందజీ పాల్గొని 'యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా జాగ్రత్త వహించాలనీ, తోటి వారికి సహాయం చేసే మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవాలనీ, స్వశక్తిపై ఆధారపడినవారే ఉన్నత శిఖరాల్ని అధిరోహించగలరనీ' యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ సరోడే, ఇతర పుర ప్రముఖులు పాల్గొన్నారు. ❖

నివేదిక : పరమేశ్వర్ రెడ్డి

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య
స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు : 15 సం॥, ఆ పైన
స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము : 2 సంవత్సరములు
సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత : 5 సం॥
సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-

హైదరాబాద్ కులప్రశాసకుడు

Sponsored by:
KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED
Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**



సుబోధ

భక్తిసాగరంలో మునుగుదామనే అభిలాష ఎవరికీ లేదు. వివేక వైరాగ్యాలను కానీ, సాధనలను కానీ ఎవరూ లక్ష్యపెట్టనే పెట్టరు. ఏ పుస్తకం నుంచో నాలుగు ముక్కలు నేర్వగానే పరులకు ధర్మోపదేశం చెయ్యాలని ప్రతి వ్యక్తీ తహతహలాడతాడు. ఇతరులకు బోధించడమంటే అంత తేలికా! ఈశ్వర సాక్షాత్కారాన్ని పొందినవాడే బోధించగలడు!

నేటి మతబోధకుల విధానాలు ఎలాంటివో మీకు తెలుసా? ఒక్కడికి మాత్రమే సరిపోయే అన్నం ఉండగా వంద మందిని విందుకు ఆహ్వానించడం లాంటిది. అణుమాత్రమైనా ఆత్మానుభవం ఉందో లేదో, మహాధర్మోపదేష్టలుగా నటిస్తూ ఉంటారు.

మొదట నీ హృదయాలయంలో భగవంతుణ్ణి ప్రతిష్ఠించుకో! ముందుగా అతడి సాక్షాత్కారం పొందు. భగవంతుణ్ణి చూశాక ప్రసంగాలు, బోధలు, ఉపన్యాసాలు మొదలైనవి ఎన్ని చేసినా చెయ్యవచ్చు. అంతేకానీ అంతకు ముందు కాదు. విషయలోలురై ఉండీ భగవంతుణ్ణి గురించీ, బ్రహ్మాన్ని గురించీ ప్రసంగించడం ఆలయంలో దేవుడు లేకుండా ఆరాధన కోసం శంఖం ఊదడంవంటిది.

ఒక బోధకుడు భక్తులు పరవశులయ్యేలా ఉపన్యసించేవాడు. కానీ స్వతహాగా అతడు మంచి నడవడిక ఉన్నవాడు కాదు. అతడి ప్రవర్తన చూసి, అంతమంది హృదయాల్లో భక్తిభావాలను పురికొల్పగలిగే తాను స్వయంగా అయోగ్యుడై ఉండడానికి కారణం ఏమిటని నేను అతణ్ణి అడిగాను. అతడు గౌరవంగా తల వంచి ఇలా అన్నాడు: "అయ్యా! నిజం. చీపురు స్వయంగా నీచమైన వస్తువు అయ్యుండీ నేల మీది ధూళిని చిమ్మివెయ్యడం లేదా!" అప్పుడు అతడికి నేనేమీ బదులు చెప్పలేకపోయాను. ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ,

రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500 029

ఫోన్: 040-2766 7799, 2763 3936; E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద   సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

No. 1120/57. Postal Registration No. HD-1071/2010-12. Licensed to Post Under WPP : CPMG/AP/HC-13/WPP/2010-12.

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation inwardly, and by work done in a spirit of service outwardly."

- Swami Ranganathananda



With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex,Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net
Web Site : www.svisslabss.net

TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.